RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers



హైదరాబాద్ | 31 జనవరి 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:203

# వెదురు కర్రలే దైవాలుగా... గద్దెలే గర్భగుడులుగా...

## కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న మేడారం సమ్మక్క--సారలమ్మ మహా జాతర









మేడారం, ములుగు జిల్లా జనవరి 30, శుక్రవారంవెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు--కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్క--రైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం --- మేడారం సమ్మక్క--సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది.

వన దేవత... మన దేవత... జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన జాతర ప్రాంగణం

జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి.

భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రిస్తున్న అధికార యంత్రాంగం

భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.

జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

వైద్య బృందాలు, వాలంటీర్లు అప్రమత్తం

జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.

వన దేవతల సేవలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు

మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు.

సమ్మక్క--సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

ప్రముఖుల దర్శనాలు...

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క--సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ -- నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి -- తల్లులను దర్శించుకున్నారు. ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ దర్శించుకున్నారు.

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ -- అమ్మవార్లను దర్శించుకున్నారు .

మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ శ్రీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ -- అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క--సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు

భక్తుల ప్రశంసల జల్లు

ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.

భక్తి, నమ్మకం, సంప్రదాయం, సంస్కృతి సమ్మేళనంగా...

ప్రభుత్వ సమర్థ నిర్వహణతో...

సజావుగా సాగుతున్న మేడారం సమ్మక్క--సారలమ్మ మహా జాతర.

# రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..




హైదరాబాద్, జనవరి 30 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో తన కోర్సు విజయవంతంగా పూర్తి చేశారు. హార్వర్డ్ లోని 'కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'లో నిర్వహించిన వారం రోజుల ప్రత్యేక లీడర్‌షిప్ కోర్సులో చేరి పూర్తి చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఆ సంస్థ నుండి అధికారికంగా లీడర్ షిప్ కోర్సు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు జరిగిన 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే పేరుతో నిర్వహించిన తరగతులకు సీఎం రేవంత్ స్వయంగా హాజరయ్యారు.ఈ అపూర్వమైన అనుభవాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' షేర్ చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి తాను ఈ తరగతులకు హాజరైనట్లు తెలంగాణ సీఎం పేర్కొన్నారు. ఈ లీడర్‌షిప్ కోర్సులో భాగంగా అక్కడి ప్రొఫెసర్లు, టీచర్స్, తన తోటి విద్యార్థుల నుంచి పాలనాపరమైన మెళకువలు, నాయకత్వ లక్షణాల గురించి ఎంతో నేర్చుకున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు.రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు -24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.





నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి: గాంధీ భవన్‌లో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హార్కర్ వేణుగోపాల్, హనుమంతు రావు, ఓబీసీ కో ఆర్డీనేటర్ నిర్మస కూమార్ యాదవ్ ,జి.రమేష్ , గోపి , ముత్యాలు తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొని గాంధీజీ సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా వారు మహాత్మా గాంధీ బోధించిన అహింస, సత్యం, సమానత్వ విలువలు నేటి సమాజానికి మరింత అవసరమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి రాజకీయ కార్యకర్త బాధ్యత అని వారు స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ విచారణ



హైదరాబాద్ జనవరి 30 ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారణ ప్రారంభించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఆయన విచారణ చేపట్టారు. బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఇతరులు వేసిన అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగుతున్నది.పిటిషనర్ల వాదనలు విన్న తర్వాత స్పీకర్ సాక్ష్యాలను నమోదు చేయనున్నారు. స్పీకర్ సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ విచారణ చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న మూడు అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు గతంలోనే వివరణ కోరింది. విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఈ క్రమంలో పెండింగ్ పిటిషన్‌లపై స్పీకర్ విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించనుంది.

ప్రజాబలం

31 జనవరి 2026 శనివారం

# మరో యుద్ధం తప్పదా...

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. వెనెజెవెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో రగిలిపోతున్న ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ఇరాన్‌కు పలుమార్లు వార్నింగ్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వార్‌కు రెడీ అవుతున్నాడు. ఆయుధాలు మోహరిస్తున్నాడు. ఇప్పటికే పాకిస్తాన్ బలగాలను ఇరాక్ సరిహద్దుకు తరలించాడు. అమెరికా యుద్ధ విమానాలను రెడీ చేశాడు. తాజాగా అమెరికాకు చెందిన అబ్రహం లింకన్ వాహక నౌక ఇటీవల ఇక్కడికి చేరింది. దీనితో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇరాన్‌కు తరలించాడు. పశ్చిమసియాలో మొన్నటిదాకా ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య దాడులు కొనసాగేవి. ఈ రెండు దేశాల మధ్యలోకి ఇరాక్, సిరియా కూడా వచ్చాయి. దీంతో దాడులు మరింత పెరిగిపోయాయి. ఇప్పుడు అక్కడ పరిస్థితులు నెమ్మదిగా మారిపోతున్న వేళ.. పశ్చిమసియాలో మరోసారి యుద్ధ వాతావరణం ఏర్పడిందిఅమెరికాకు చెందిన యుద్ధ విమాన వాహన నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా కు చేరుకోవడం కలకలాన్ని కలిగిస్తోంది. దీంతో ఇరాన్ పై అమెరికా దాడులు చేసే అవకాశం ఉందని ప్రచారం మొదలైంది.అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌక మాత్రమే కాకుండా, యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ సరిహద్దుల్లోకి వెల్లినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ యుద్ధ విమాన వాహక నౌకలు అక్కడికి వచ్చాయని తెలిపింది.ఈ విమానాలు ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో ల్యాండ్ అవ్వలేదు. హిందూ సముద్రంలో అవి దిగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది మాత్రమే కాకుండా యుద్ధ విమానాలను, కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కొంతకాలంగా ఇరాన్ దేశంలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఘర్షణలో జరుగుతున్న నేపథ్యంలో వేరాదిమంది ఇప్పటికే చనిపోయారు. అక్కడి ఆందోళనలకు ట్రంప్ బాసటగా నిలిచారు. ఒకవేళ అక్కడి ప్రభుత్వం ఆందోళనకారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే మాత్రం తాము రంగంలోకి దిగుతామని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత అమెరికా సైన్యం భారీగా ఇరాన్ దిశగా వెళ్లడం రకరకాల సంకేతాలు ఇస్తుంది. ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణంలోనే ఇరాన్ మీద అమెరికా దాడి చేసే అవకాశాలు తెలుస్తోంది. మరోవైపు అమెరికాతో ఇరాన్ చర్చలు జరిపే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చర్చలు ముందుకు సాగితే పరిణామాలు వేగంగా మారిపోతాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు.యూఎస్ సెంట్రల్ కమాండ్ దీనిని నిర్ధారించింది. ప్రాంత స్థిరత్వం, భద్రతా కారణాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. ఈ నౌబల బృందం ఆరబియా సముద్రం సరిహద్దుల్లో మాత్రమే కాక, హిందూ మహాసముద్రంలో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఫలితంగా, ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.పెంటగాన్ ఇంకా ఎక్కువ ఫైటర్ జెట్‌లు, సైనిక కార్గో విమానాలను ఈ దిశలోకి తరలించే యోచనలో ఉంది. ఇరాన్‌లో పొలిటికల్ అస్థిరతలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో వేల మంది మరణించినట్లు అంచనా. ఆందోళనలకు మద్దతుగా నిలబడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వం ఏమైనా కఠిన చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. దీని ఫలితంగా భారీ సైనిక బలగాలను రెడీ చేస్తున్నామని ప్రకటించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తాలను మరింత పెంచింది.ఒకవైపు యుద్ధ విమానాలు, నౌకలను మోహరిస్తున్న అమెరికా.. మరోవైపు ఇరాన్ చర్చలకు ముందుకు వస్తే తాము సిద్ధమని అమెరికా అధికారి తెలిపారు. వెనెజువెలాపై సైలెంట్ ఆపరేషన్ సక్సెస్ అయిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఖమేనీ ప్రభుత్వాని మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు, ఈమేరకు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నాడు. దీంతో నిరసనకారులు కూడా అమెరికావైపు ఆశగా చూస్తున్నారు. గతంలో ఒకసారి దాడి చేసిన అమెరికా ఈసారి పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతోంది.అమెరికా అబ్రహం లింకన్ యుద్ధ నౌకను ఇరాన్ దిశగా పంపుతోంది. శుక్రవారానికి సిద్ధంగా ఉండాలని ఇరాన్ నౌకలను అడ్డుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇజ్రాయెల్ దళాలు కూడా అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో అమెరికా ఇరాన్ డోమ్ యాక్టివేట్ చేసి, ఎయిర్ స్ట్రైక్‌లకు సిద్ధపడుతోంది. అమెరికాతో కలిసి దాడికి ఇజ్రాయెల్ కూడా రెడీ అయింది.భూమిపై నుంచి దాడులు చేయకుండా ఎయిర్ స్ట్రైక్‌లు చేయాలని అమెరికా భావిస్తోంది. భూతల దాడులు చేస్తే ఐఆర్‌జీసీ అడ్డుకుంటుంది. అమెరికా సైనికులను చంపే ప్రమాదం ఉంది. అందుకే అమెరికా ఐఆర్‌జీసీని తీవ్రవాద సంస్థగా ప్రకటించింది. ప్రపంచ దేశాలతోనూ ప్రకటింపజేసి ఇరాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది.తాజా పరిణామాల నేపథ్యంలో చైనా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌పై యుద్ధం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. పాలస్తీన, గత ఇరాన్ దాడుల సమయంలో ఇలాంటి స్టేట్‌మెంట్‌లు జారీ చేసింది. అయినప్పటికీ, ఇరాన్‌కు సరైన మద్దతు ఇవ్వకుండా బెదిరింపులకు మాత్రమే దిగుతోంది.ఈ టెన్షన్ చమురు ధరలు, గ్లోబల్ ట్రేడ్‌ను ప్రభావితం చేస్తాయి. చైనా హెచ్చరిక అమెరికా వ్యూహాలను ప్రశ్నిస్తూ, మధ్యప్రాచ్య స్థిరత్వానికి సవాల్‌గా మారింది.

## సిగాచి ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై హైకోర్టు అసహనం

హైదరాబాద్ జనవరి 30 ;సిగాచి ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి అసహనం వ్యక్తంచేసింది. గత ఏడాది సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించిన ఘటనలో 56 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. ఇంకో 28 మంది క్షతగాత్రులయ్యారు.ఆ మరణించిన 56 మందికి, ఆచూకీ లభించని 8 మందికి, 28 మంది క్షతగాత్రులకు పరిహారం అందించాలని, ప్రమాదంపై దర్యాప్తు కోసం ా౫ు ఏర్పాటు చేయాలని బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతూ.. 'పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు..? ఎంత ఇస్తున్నారు..? ఎప్పుడు ఇస్తారు..?' అంటూ న్యాయమూర్తి ఒకింత ఆగ్రహంతో ప్రశ్నించారు.పరిహారం పంపిణీకి సంబంధించిన అంశాలపై కంపెనీ వివరణ ఇవ్వాలని, దానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలని, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతోపాటు, చట్టప్రకారం అందాల్సిన పరిహారం వివరాలను సమర్పించాలని ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండళ్లను సుమోటో ప్రతివాదులుగా చేర్చి హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నోటీసులు ఇచ్చారు

## సమ్మక్క సారలమ్మ లకు మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు



హుస్నాబాద్ హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండలంలోని జాగీరుపల్లి లో సమ్మక్క సారలమ్మ అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకకున్నారు.

## తిరుపతి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ దర్యాప్తు సక్రమంగా జరుగలేదు పూర్తి దర్యాప్తు కోసం మరో సప్లిమెంటరీ చార్జ్‌షీటు దాఖలు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు





తిరుమల జనవరి 30 తిరుపతి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ దర్యాప్తు సక్రమంగా జరుగలేదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు , సభ్యులు ఆరోపించారు. శుక్రవారం తిరుమలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పూర్తి దర్యాప్తు కోసం మరో సప్లిమెంటరీ చార్జ్‌షీటు దాఖలు చేస్తామని వెల్లడించారు. మైక్రో డీఎన్ఏ చేయాలని కోరుతున్నామని అన్నారు.సుప్రీంకోర్టుకు సిట్ ఇచ్చిన నివేదిలో ఎక్కడా కూడా లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు వాడలేదని చెప్పలేదని, అదేవిధంగా కల్తీ నెయ్యి వాడారని వెల్లడించిందని అన్నారు. వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పాలు, వెన్న లేకుండా 60 లక్షల కిలోల నెయ్యి ఎలా వచ్చింది. కొన్ని కెమికల్స్‌తో కల్తీ నెయ్యిని వాడి సుమారు 20 కోట్ల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంచి పెట్టి మహా పాపం చేశారని విమర్శించారు.లడ్డూల తయారీలో ప్రాణాలు తీసే రసాయనాలు వాడి భక్తుల ప్రాణాలతో ఆటలు ఆడుకున్నారని ఆరోపించారు. నాటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ముఠా మేస్త్రీ వైఎస్ జగన్ సహకారం లేనిదే ఒక ప్రైవేట్ వ్యక్తి నెయ్యి సరఫరా ద్వారా కోట్లాది రూపాయలు లావాదేవీలు జరుపడం సాధ్యమేనా అంటూ ప్రశ్నించారు.ఐదేళ్లపాటు ప్రతి విషయంలోనూ నియమ, నిబంధనలను తూట్లు పొడిచి టీటీడీని భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. క్రిమినల్స్ అంతా కలిసి ప్రణాళిక ప్రకారం హిందువు మనోభావాలను దెబ్బదీసే విధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హిందువులంతా ఏకమై శ్రీవారి ఆలయాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## అరచేతితో సూర్యకాంతిని ఆపలేరు.. అలాగే కేసీఆర్ చేసిన అభివృద్ధిని దాచలేరు కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలనపై కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్ జనవరి 30;-10కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఒక అక్రమ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి డైవర్షన్ డ్రామా ఆడుదామని అనుకున్న సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులా అదే రోజు తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అద్భుత ప్రగతిని ఎకనామిక్ సర్వే 2025-26 కళ్లకుకట్టిందని అన్నారు.అర చేతితో సూర్యకాంతిని ఆపలేరని అంటారని.. దీనికి తగ్గట్టే కేసీఆర్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని దాచిపెట్టాలని రేవంత్ బృందం ఎన్ని దుష్టపన్నాగాలు పన్నినప్పటికీ కుదరట్లేదని కేటీఆర్ అన్నారు. ఆర్బీఐ, నీతిఆయోగ్ వంటి మేధో సంస్థలు, 'ది ఎకానమిస్ట్' వంటి అంతర్జాతీయ పత్రికలు, నిపుణులు కేసీఆర్ పాలనను ఇప్పటికే వేనోళ్ల పొగిడారని గుర్తుచేశారు. తాజాగా ఈ జాబితాలో కేంద్రప్రభుత్వం వెలువరించిన ఆర్థిక సర్వే 2025-26 కూడా చేరిందని తెలిపారు. కాళేశ్వరానికి, మిషన్ కాకతీయకు కితాబు ఇచ్చాయని అన్నారు.2014లో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలుగా ఉంటే అది 2023 ఆర్థిక సంవత్సరానికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగినట్టు సర్వే వెల్లడించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్, మల్టీ పర్పస్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం, చెరువుల పునరుజ్జీవనానికి ఉద్దేశించిన మిషన్ కాకతీయ పథకాలతోనే రాష్ట్రంలో సాగు విప్లవం సాధ్యమైందని ఆర్థిక సర్వే నొక్కి చెప్పిందని పేర్కొన్నారు. అలా తొమ్మిదేండ్ల వ్యవధిలోనే 89 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడంలో కేసీఆర్ సర్కారు విజయం సాధించినట్టు ప్రశంసించిందన్నారు.

## జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క, సారలమ్మలు గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



మేడారం జనవరి 30 జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క, సారలమ్మలని,గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు.శుక్రవారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు.తెలంగాణ ప్రజలు బాగుండాలని సమ్మక్క, సారలమ్మలను కోరుకోవటం జరిగింది.కాకతీయుల వంటి రాజులతో కొట్లాడిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు. వారి జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు. గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు. అని కొనియాడారు.వారి స్ఫూర్తితోనే మేము తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తాం. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలు అందని పరిస్థితి ఉంది. సామాజిక న్యాయం అందరికీ ఇప్పటికీ దక్కలేదు. ఈ పరిస్థితి పోయేలా మేము జాగృతి తరపున మా వంతు కృషి చేస్తామన్నారు.

## చదువు అనేది గేమ్ ఛేంజర్.. సరైన సమయంలో నిర్ణయాలు ఉండాలి ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు శ్రీకారం చుట్టాలి : సిఎం చంద్రబాబు



అమరావతి జనవరి 30 మనం మాత్రమే కాదు.. సమాజం కూడా బాగుండాలనేది మన సంస్కృతి అని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పిల్లలు ఎంత పెద్దవాళ్లయినా జీవితాంతం ఏ సహాయం కావాలన్నా అందించే సంస్కృతి మనది అని అన్నారు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గుంటూరు జిజిహెచ్ మాతా శిశు కేంద్రాన్ని సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.. కళాశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనేక సేవా కార్యక్రమాలను ముందుకొచ్చి భారీగా విరాళాలు ఇస్తున్నారని, చైతన్యం పెరిగిందని.. సేవా కార్యక్రమాలకు చాలా మంది ముందుకొస్తున్నారని అన్నారు. జన్మభూమి కార్యక్రమానికి పిలుపు ఇవ్వగానే అభివృద్ధికి దోహదం చేశారని, ఆర్థిక అసమానతలు తగ్గితేనే సమాజం బాగుంటుందని సూచించారు. చదువు అనేది గేమ్ ఛేంజర్.. సరైన సమయంలో నిర్ణయాలు ఉండాలని, భారతరత్నకు మారు పేరుగా దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉన్నత స్థితికి చేరుకుంటారని, ఆర్థిక అసమానతలు తగ్గాలి.. పేదరికం లేని సమాజం చూడాలి అని అన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు శ్రీకారం చుట్టాలని, పి4 కార్యక్రమానికి ముందుకు రావాలని అందరినీ కోరుతున్నానని ఆకాంక్షించారు. సంపాదనలో కొంతభాగం సమాజానికి వెచ్చించాలని, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో భారత్ నాలుగో స్థానంలో ఉందని కొనియాడారు. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందని, 2038 నాటికి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందని జోష్యం చెప్పారు. 2047 నాటికి ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో భారత్ ఉండాలనేది మనందరి ఆకాంక్షని, స్వర్ణాంధ్ర విజన్ 2047 తయారుచేశామని అన్నారు. హైదరాబాద్ కంటే మెరుగైన నగరం నిర్మించాలని, అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీగా రూపొందుతుందని చెప్పారు. ఆనాడు ఐటి..ఇప్పుడు ఎఐ వచ్చిందని, అమరావతిలో క్వాంటం వ్యాలీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# నామినేషన్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన
## ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ తనిఖీ



**సిరిసిల్ల/వేములవాడ, జనవరి - 30 (ప్రజాబలం ప్రతినిధి)**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న ఎస్.ఎస్.టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు పరిశీలనలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, నోడల్ అధికారులు నవీన్ కుమార్, శ్రీనివాసాచారి, తహసీల్దార్లు జయంత్ కుమార్, మహేష్ కుమార్, టీపీఓ అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు ఉన్నారు.

# ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికల్లో 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి
## కొట్టం శిరీష రంజిత్ రెడ్డి నామినేషన్ దాఖలు



**ఖమ్మం ప్రతినిధి జనవరి 30 (ప్రజాబలం)** రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సూచనలతో ఏదులాపురం మున్సిపాలిటీ 30వ వార్డు కౌన్సిలర్ గా కొట్టం శిరీష రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో భాగంగా నామినేషన్ దాఖలు చేశారు ఆమె పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా డప్పు వాయిద్యాలతో ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందుకొని జలగం నగర్ ఎంపీడీవో ఆఫీస్ నందు 30వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో ప్రతి ఒక్క పేదవాడికి న్యాయం జరుగుతుందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంత్రి పరిపాలనలో ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీని నెంబర్ వన్ స్థానంలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఆమె తెలిపారు 30వ డివిజన్ అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం ప్రజలకు ఏ అవసరమైన నిరంతరం అందుబాటులో ఉంటానని సంక్షేమ ఫలాలు అందరికీ అందే విధంగా తోడ్పాటునందిస్తానని ఆమె తెలిపారు 30వ వార్డు లోని ప్రజలు తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూక్య సురేష్ నాయక్ మంగీలాల్ వెంపటి రవి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వందలాదిమంది కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్
### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ ఈఓ, అర్చకులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి -30 (ప్రజా బలం ప్రతినిధి)**ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ నుంచి వేములవాడలో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, అధికారులు, అర్చకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ, అర్చకులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. 15 వ తేదీన మహా శివరాత్రి జాతర నిర్వహించనున్నామని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై అధికారులను ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కల్వర్టును ఢీకొని దూసుకెళ్లిన వ్యాన్..
### పదహారు మందికి గాయాలు

కృష్ణా బంటుమిల్లి మండలం పెందుర్తి వద్ద శుక్రవారం ఉదయం అంతర్వేది తీర్థానికి వెళ్లి వస్తుండగా ఒక మినీవ్యాన్ కల్వర్టును ఢీకొని బోదెలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నాగాయలంక మండలం సొర్లగొందికి చెందిన 16 మంది గ్రామస్థులు గాయపడ్డారు. వీరిలో కొందరికి తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ బోల్తామహిళ, డ్రైవర్ కు గాయాలు

ఖమ్మం జిల్లా వైరా మండలం జింకలగూడెం గ్రామంలో శుభాబుల్ కర్ర లోడుతో మందికి వస్తున్న లారీ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో కిరాణం బడ్డీ పై సుబాబుల్ కర్రలు పడిపోవడంతో మహిళకు లారీ డ్రైవర్ కీ గాయాలయ్యాయి బోనకల్లు వైపు నుంచి వైరా వైపు వస్తున్న సుబాబుల్ కర్ర లారీ జింకల గూడెం గ్రామంలో సుబాబుల్ కర్ర లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న కిరాణం బడ్డీ పై పడిపోయింది అదే సమయంలో కిరాణా సరుకులు కోసం వచ్చిన మహిళకు లారీలో ప్రయాణిస్తున్న డ్రైవర్ కు తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు ప్రమాద సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు ..

# మున్సిపల్ ఎలక్షన్లలో నామినేషన్ వేసే తేదీని పొడిగించాలి
## బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ జనవరి 30 మున్సిపల్ ఎలక్షన్లలో నామినేషన్ వేసే తేదీని పొడిగించాలని బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరుగుతున్న నేపధ్యంలో .. పోటీ చేయాలనుకున్న బిసి , ఎస్సి , ఎస్టీ ఆశావహులు మొక్కులలో నిమగ్నమైన వేళ నేటితోనే ఈ గడువును ముగించడం అట్టడుగు వర్గాల మనోభావాలను పరిగణన లోకి తీసుకోకపోవడమేనన్నారు..ఆర్టికల్ 324 ద్వారా ఏర్పాటైన ఎన్నికల కమిషన్ ఫ్రీ అండ్ ఫెయిర్ గా నిర్వహించాల్సిన ఎన్నికలను ఇంత హడావిడిగా నిర్వహించడం రాజ్యాంగ విలువలను భేఖాతరు చేయడమేనన్నారు..ముఖ్యమంత్రి రాష్ట్రంలో అందుబాటులో లేని సమయంలో ఎన్నికల కమిషన్ తన తీసుకున్న ఈ నిర్ణయాన్ని పునరాలోచించి నామినేషన్ గడువును పొడిగించాలన్నారు.. ఇందుకోసం తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు ..42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర హై కోర్ట్ పరిధిలో ఉండగానే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వం నిర్వహించినా,పార్టీల గుర్తుతో సంబంధం లేని దృష్ట్యా,కేంద్ర ప్రభుత్వ నిధులు,స్థానిక పారిశుధ్య సమస్యల రీత్యా తాము ప్రభుత్వానికి సహకరించామన్నారు..బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాకముందే ఇప్పుడు పార్టీ గుర్తుపై జరిగే మున్సిపల్ ఎన్నికలనుహడావిడిగా నిర్వహించడం వలన బీసీలు పెద్దఎత్తున నష్ట పోయే అవకాశం ఉందన్నారు..త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రాజకీయ చైతన్య యాత్రను నిర్వహించి బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ వీ జీ ఆర్ నారగోని తెలిపారు..మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న బిసి అభ్యర్థులకు ... తమ సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు ఉన్న ఒక రాజకీయ పార్టీ నుండి బీఫామ్ ఇప్పించి ,గెలిపించుకుంటామని స్పష్టం చేశారు

# కుష్టు వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుంటాము: డా. జి డి నాయుడు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ జనవరి 30: మన జాతిపిత మహాత్మా గాంధి మాటలలో కుష్టువ్యాధి వైద్యపరమైన సమస్య మాత్రమే కాదు, ఇది సామాజకపరమైన సమస్య, చైతన్యమైన సమాజములో కుష్టు నిర్మూలణ సాధ్యము అంటూ ప్రజలందరూ వివక్షను విడనాడి కుష్టువ్యాది నిర్మూలనా ఉద్యమములో పాల్గొన్ననాడే, వ్యాధి పీడితులకు సముచితమైన స్థానమును కల్పించిన నాడే ఈ వ్యాధిని మన సమాజం నుండి దూరం చేయగలము అంటూ తనే స్వయంగా వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుని సేవలందించారు అని హిందూ కుష్ఠ నిర్మూలనా సంఘ్ సెక్రటరీ డా. జి డి నాయుడు అన్నారు. ఈ మాటలను, చేతలను ఆదర్శంగా తీసుకుని ప్రతి సంవత్సరం గాంధీ వర్ధంతి జనవరి 30న కుష్టు వ్యతిరేక (నిరాకరణ) దినం గాను, జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యతిరేక (నిరాకరణ) పక్షము గాను మనము పాటించడం జరుగుతున్నది అని ఇందులో భాగంగా కుష్టు వ్యాధి గురించి అన్ని వర్గాల ప్రజలు లో అవగాహన కల్పించుట కై గ్రామ గ్రామాన ప్రచార ఉద్యమాలు సభలు నిర్వహించడం మన ఆనవాయితీ అలాగే కుష్టు వ్యాధిగ్రస్తులుకు మెరుగైన సేవలు అందించిన వారిని గౌరవించుకోవడం మన ఆనవాయితీ మరియు అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా ను ముఖ్యముగా ప్రింట్ మీడియాను, సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ప్రచార కార్యక్రమాలు జరిపేందుకు మనము ముందుకు సాగు చున్నాము అని ఇందులో భాగంగా నేడు మాదాపూర్, హైదరాబాద్ లో వేదాశ్రమ్ ఫౌండేషన్ మరియు హిందూ కుష్ఠ నిర్మూలన సంఘ్ ఆధ్వర్యంలో కుష్ఠ వ్యాధి అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహించారు.ఇందులో పలువురు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుకు అవగాహనా సదస్సులు నిర్వహించడం జరిగింది. డా. జి డి నాయుడు మాట్లాడుతు శరీర ఉపరి తలము, చర్మము పై స్పర్శ లేని గోధుమ రంగు మచ్చ కుష్ఠ వ్యాధి యొక్క ప్రాధమిక చిహ్నం గా గుర్తించి వెంటనే దగ్గర లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రములో ఉచిత బహుళ ఔషద చికిత్స ద్వారా స్వస్థత పొందడమే కాకుండా ఎటువంటి అంగవైల్యానికి గురికాకుండా రక్షించు కోవచ్చు అని హిందూ కుష్ఠ నిర్మలనా సంఘ్ సెక్రటరీ డా. జి డి నాయుడు అన్నారు. వేదాశ్రమ్ ఫౌండేషన్, ఫౌండర్ చైర్మన్ రఘురామ్ మాట్లాడుతువ్యాధి గ్రాస్తులు పట్ల ఎటువంటి వివక్ష, కలంకితభావము చూపకుండా వారు మనలో ఒక భాగమే అని గుర్తు చేస్తూ వారికి అవసరమైన ఫిజియో థెరపీ, ఉచిత వీజ= పాద రక్షకులు తాము అందిస్తున్నామన్నారు.రాధా కిషన్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ కుష్ఠ వ్యాధి వలన అంగవైకల్యానికి గురైన వారికీ ప్రభుత్వం ఉచిత శస్త్ర చికిత్స కూడ జరిపిస్తున్నదని ఈ సదుపాయాలు అవసరం ఉన్న వారందరు ఉపయోగించు కోవాలన్నారు. వేదాశ్రమ్ సభ్యులు రాజేష్, హేమసుందర్, సన్యాసి రావు, రోహిణి, చందన, రవీంద్ర, బాలకృష్ణ, శ్రీనివాస్, కాళిదాసు, దీపక్, రామ్, శ్రావణకుమార్, దుర్గాప్రసాద్, నరసింహ రావు, కృష్ణ, పవన్ కళ్యాణ్, వెంకటరమణ, రమేష్, వంశీ లు పాల్గొన్నారు.అందరు కలసి కుష్టు వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుంటాము, కుష్టు వ్యాధిని అంతమొందిస్తాము అని ప్రతిజ్ఞ చేశారు

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ
## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



తుంగతుర్తి, జనవరి 30 : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర స్థాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యతో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ పై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని, అందులో భాగంగానే మొన్న హరీష్ రావుకు, నిన్న కేటీఆర్ కు, నేడు కేసీఆర్ కు ఫోన్ టాపింగ్ కేసులో నోటీసులు పంపిస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు తెరలేపుతుందని మండిపడ్డారు.ఇకనైనా పరిపాలన మీద సోది తెచ్చుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, మట్టిపెల్లి శ్రీశైలం, దొంగరి శ్రీనివాస్, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, మనోజ్, రమేష్, కరుణాకర్, మండల నాయకులు మల్యాల రాములు, గుడిపాటి వీరయ్య, కడారి దాసు, గోపగాని రమేష్, మట్టిపెల్లి వెంకట్, సోమేశ్, యాకూబ్, గునిగంటి యాదగిరి, తునికి లక్ష్మి, గోపగాని శ్రీనివాస్, బొజ్జ సాయికిరణ్ వెంకటేష్, మల్లేష్, భాస్కర్, మహేందర్, వెంకన్న పాల్గొన్నారు

# ఫిబ్రవరిలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన

విశాఖపట్టణం, జనవరి 30, విశాఖలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్ అయింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధమయింది. భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలం తర్లు వాడలో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసి త్వరలో గూగుల్ సంస్థకు అప్పగించనున్నారు. దాదాపు రైతుల భూములకు పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. సింహాచలం భూముల కేటాయింపునకు సంబంధించిన ఫైలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. బెంగళూరుకు చెందిన ఆర్ఎం జెడ్ కార్పొరేషన్ విశాఖలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. అయితే ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో ఇదివరకే ఒప్పందం చేసుకుంది. అయితే తాజాగా ఆ సంస్థ శంకుస్థాపనకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఫిబ్రవరిలోనే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన ఉంటుందని విశాఖ జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత సంస్థ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు..ఆసియాలోని అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. కొద్ది నెలల కిందట ఏపీ ప్రభుత్వంతో గూగుల్ ఒప్పందం చేసుకుంది. అప్పటినుంచి రంగంలోకి దిగింది ఏపీ ప్రభుత్వం. ముఖ్యంగా భూముల సేకరణకు సంబంధించి వేగవంతం చేసింది. ఆనందపురం మండలం తర్లువాడ పరిసరాల్లో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. త్వరలో ఏపీఐఐసీ ద్వారా గూగుల్ కు ఆ భూములను అప్పగించనుంది. 51 మంది రైతుల నుంచి సేకరించిన భూములకు గాను 49 మంది రైతుల ఖాతాల్లో పరిహారానికి గాను డబ్బులు జమ చేశారు. మిగతా ఇద్దరు రైతులకు కూడా జమ చేస్తామని విశాఖ జిల్లా కలెక్టర్ తెలిపారు.అయితే ఈ గూగుల్ డేటా సెంటర్కు నీరు చాలా అవసరం. జీవీఎంసీద్వారా నీటిని అందించే పనులపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు సింహాచలం భూముల కేటాయింపులకు సంబంధించి ఫైల్స్ ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రక్రియ పూర్తయితే డేటా సెంటర్ ఏర్పాటుకు కీలక అడుగు పడినట్టే. మరోవైపు ఫిబ్రవరిలోనే డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఐటీ సంస్థలు పెద్ద ఎత్తున విశాఖకు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల దావోస్ పెట్టుబడుల సదస్సులో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఖీఓజి సంస్థతో ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు లక్ష కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టనుంది సదరు సంస్థ. ఈ నేపథ్యంలో ఖీఓజి ప్రతినిధులు విశాఖ తో పాటు విజయనగరంలో పర్యటించారు. ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించారు.

# అమరావతిలో మొదటి క్యాష్‌లెస్ టోల్ ప్లాజా

విజయవాడ, జనవరి 30, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలి టోల్‌గేట్ రెడీ అయింది. ఏపీ సచివాలయంకు వెళ్లే దారిలో వెంకటపాలెం గ్రామం వద్ద కొత్తగా నిర్మించిన విజయవాడ వెస్ట్ బైపాస్‌పై టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. ఇది దేశంలోనే మొట్టమొదటి క్యాష్ లెస్ టోల్ ప్లాజా అని ప్రచారంలో ఉంది. కేవలం డిజిటల్ పేమెంట్స్ లేదా ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే ఇక్కడ టోల్ ఫీజ్ వసూలు చేస్తారు. త్వరలోనే ఈ పద్ధతిని దేశంలోని అన్ని టోల్ ప్లాజాలలోనూ అమలు చేయబోతున్నారు. ప్రస్తుతానికి ఈ వెస్ట్ బైపాస్‌లో ఒకవైపు ట్రాఫిక్ పూర్తి స్థాయిలో మరోవైపు ట్రాఫిక్‌ను పాక్షికంగానూ వదులుతున్నారు. రెండు వైపులా బైపాస్ పూర్తిగా అందుబాటులోకి వచ్చాక అంటే మార్చి నెల టైమ్‌కి ఈ టోల్ ప్లాజాను మొదలు పెట్టనున్నట్టు తెలుస్తోంది.రాష్ట్ర విభజన, అమరావతిలో రాజధాని ప్రకటన తరువాత విజయవాడ నగరం పైనుంచి వెళ్లే ట్రాఫిక్ విపరీతంగా పెగిరి పోయింది. దీన్ని డైవర్ట్ చేయడం కోసం చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాల కోసం కాజా టోల్ ప్లాజా దగ్గర నుంచి రాజధాని గ్రామాల మీదుగా గొల్లపూడి వరకూ 17.8 కిలోమీటర్ల కొత్త బైపాస్ వేశారు.

అక్కడి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు వేరే మార్గంలో వెళ్ళిపోతాయి. అలాకాకుండా వైజాగ్ వైపు వెళ్లే వాహనాల కోసం అదే బైపాస్ మరో 30కిమీ వెళ్లి చిన్న అవుట్ పల్లి (గన్నవరం ఎయిర్ పోర్ట్ ) వద్ద హౌరా హైవేతో కలుస్తాయి. సో విజయవాడ సిటీలోకి వెళ్లే అవసరం లేకుండా మొత్తం 47.8 కిమీ బైపాస్ నిర్మించారు. దీన్నే విజయవాడ వెస్ట్ బైపాస్ అని పిలుస్తున్నారు. ఇది నేషనల్ హైవే 16 (ఔఊ 16)లో భాగం. దీని వల్ల అనవసర ట్రాఫిక్ ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా గమ్యస్థానాలకు వెళ్లేందుకు దూర ప్రాంత వాహన దారులకు ప్రయాణం ఈజీ అవుతోంది. ఈ హైవే మధ్యలో కృష్ణా నదిపై నిర్మించిన 3.1కిమీ ల బాహుబలి బ్రిడ్జ్ ఒక స్పెషల్ ఎట్రాక్షన్.విజయవాడ వెస్ట్ బైపాస్ మొత్తాన్ని అధునాతన టెక్నాలజీతో నిర్మించినట్టు హైవే అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ త్వరలోనే అసలు టోల్ ప్లాజాలే అవసరం లేకుండా ప్రయాణించిన దూరాన్ని బట్టి అమౌంట్ కట్ అయ్యేలా కొత్త విధానం తెస్తామని ప్రకటించారు. దీనవల్ల టోల్ గేట్‌ల వద్ద ఏర్పడే ట్రాఫిక్ కష్టాలు అస్సలుండవు అనేది వారి ఆలోచన.

ఒకవేళ ఆ పద్ధతే అమల్లోకి తెస్తే అప్పుడు ఈ వెంకటపాలెం టోల్ ప్లాజా ఏమౌతుందని మరో చర్చ అది మొదలవక ముందే జనాల్లో నడుస్తోంది. ఏదేమైనా అమరావతి రాజధాని ప్రాంతంలో రోడ్డు కనెక్టివిటీ విపరీతంగా పెంచే ప్రయత్నం చేస్తున్న కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాల పనిలో భాగంగా అమరావతి లో ఏర్పాటైన తొలి టోల్ ప్లాజా గా వెంకటపాలెం టోల్ గేట్ వార్తలకెక్కింది.

# పార్టీకి భారంగా మారుతున్న వ్యక్తిగత తప్పులు

కడప, జనవరి 30, ప్రజా జీవితంలో ఉన్నవారు ప్రతి అడుగూ ఎంతో జాగ్రత్తగా వేయాల్సిన అవసరం ఉంటుంది. వారి వ్యక్తిగత ప్రవర్తన కూడా ప్రజల పరిశీలనలోనే ఉంటుందన్న సత్యాన్ని గుర్తించాలి. ఒక చిన్న తప్పు కూడా పెద్ద దుమారంగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ వాస్తవాన్ని విస్మరిస్తే రాజకీయ జీవితం ఒక్కసారిగా కుదేలయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. ప్రస్తుతం జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం ఇదే విషయాన్ని స్పష్టంగా చూపిస్తోంది.సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం చిన్న విషయం కాదు. అలాంటి ఎదుగుదలతో పాటు హుందాతనం, బాధ్యత కూడా పెరగాలి. కానీ ఆ స్థాయికి తగిన ప్రవర్తన లేకపోతే అవకాశాలే శాపంగా మారుతాయి. అరవ శ్రీధర్ విషయంలో రాజకీయంగా వచ్చిన అవకాశాన్ని ఆయన సరిగా వినియోగించుకోలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన చర్యల వల్ల ఆయనకు అవకాశం ఇచ్చిన పార్టీ కూడా ఇప్పుడు వివాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై వచ్చిన వేధింపుల ఆరోపణలు, వాటికి సంబంధించిన వీడియోలు రాజకీయ వర్గాల్లోనే కాదు, సామాన్య ప్రజల్లోనూ చర్చకు దారితీశాయి. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి మరింత సంయమనం పాటించాల్సి ఉంటుందన్న విషయం ఇలాంటి ఘటనలతో మరోసారి గుర్తుకు వస్తోంది. సమాజం మొత్తం తన వైపే చూస్తుందన్న భావన ఉంటేనే వ్యక్తి తన ప్రవర్తనను అదుపులో ఉంచుకుంటాడు.ఇలాంటి ఘటనలు కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాదు, రాజకీయ పార్టీల ప్రతిష్ఠను కూడా ప్రభావితం చేస్తాయి. జనసేన విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, నైతికత గురించి ఎప్పటికప్పుడు మాట్లాడుతుంటారు. అలాంటి పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికరమే.

ఇదే సమయంలో ప్రతిపక్షాలు దీనిని రాజకీయంగా ఉపయోగించుకోవడం సహజమే.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనూ గతంలో పలువురు నేతలపై ఆరోపణలు వచ్చాయి. అయితే వాటిపై పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పెద్దగా స్పందించలేదన్న విమర్శలు ఉన్నాయి. అప్పట్లో పట్టించుకోని అంశాలే ఆ పార్టీకి నష్టం చేశాయన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అదే విషయాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం రాజకీయాల్లో సాధారణమే అయినా, ప్రజలు అన్నింటినీ గమనిస్తూనే ఉంటారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన వంటి పార్టీలు నైతికత గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాయి. అందుకే చిన్న తప్పు జరిగినా పెద్ద ప్రభావం పడుతోంది. అధికారంలో ఉన్నవారికి ప్రతి చర్య భూతద్దంలో కనిపిస్తుంది. అందువల్ల నాయకులు అడుగు తీసే ముందు అడుగు అత్యంత ఆలోచనతో వేయాల్సి ఉంటుంది. ఆరోపణలు వచ్చిన వెంటనే స్పష్టమైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఆలస్యం చేస్తే పార్టీ క్రెడిబిలిటీ దెబ్బతింటుంది.

అరవ శ్రీధర్ విషయంలో జనసేన నాయకత్వం అంతర్గత కమిటీ వేయడం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం సరైన దిశలో వేస్తున్న అడుగుగా భావిస్తున్నారు. అయితే ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేటి డిజిటల్ యుగంలో ఏ తప్పూ దాగదు అన్న నిజాన్ని రాజకీయ పార్టీలన్నీ గుర్తిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులను నివారించవచ్చు. ఈ నేపథ్యంలో అరవ శ్రీధర్ రాజకీయ భవిష్యత్తు ఏ మలుపు తిరుగుతుందో అన్న ఉత్కంఠత సర్వత్రా చర్చనీయాంసంగా మారింది.

# జంపింగ్ జంపాంగ్ లు

కరీంనగర్, జనవరి 30, ఎన్నికలు వచ్చాయంటే చాలు జంపింగ్ జపాంగ్ ఘటనలు పెరిగిపోతుంటాయి. పార్టీ తనకు సీటు ఇవ్వలేదని, మరో పార్టీ కండువా కప్పుకుంటారు. అక్కడ చేదు అనుభవం ఎదురైతే, మరో పార్టీలోకి లేక నేతల బుజ్జగింపులతో తిరిగి సొంతపార్టీలోకి తిరిగి వస్తుంటారు. తెలంగాణ పురపాలక ఎన్నికల సమయంలో జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇలాంటి సీన్ రిపీట్ అయింది. కౌన్సిలర్ టికెట్ కోసం ఒక నాయకుడు ఉదయం ఒక పార్టీలో చేరి, రాత్రికి మరో పార్టీ గూటికి చేరుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

కోరుట్ల పట్టణంలోని 8వ వార్డు నుంచి పోటీ చేసేందుకు తోట గంగాధర్ అనే నాయకుడు కొద్ది రోజులుగా కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదే వార్డు నుంచి పార్టీ తరఫున మరొకరు ప్రయత్నిస్తుండటం, తనకు టికెట్ హామీ రాకపోవడంతో ఉదయం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గంగాధర్ ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనకు, ఆయన మద్దతుదారులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోట గంగాధర్‌తో మాజీ కౌన్సిలర్ హమీద్, 20 మంది యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు.ఈ విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. రాత్రికి తోట గంగాధర్‌ను మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు పిలిపించి చర్చలు జరిపారు. చివరకు 8వ వార్డు అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటిస్తూ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. సీటు కోసం జంపింగ్ జపాంగ్ అంటూ స్థానికులు అంటున్నారు.

# అమిత్ షాతో పవన్ చర్చలు



విజయవాడ, జనవరి 30, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చాలా రోజుల తర్వాత ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అయితే ఈ సారి ఆయన హస్తిన పర్యటనలో ప్రత్యేకత ఉంది. చాలా రోజుల తర్వాత ఢిల్లీ వెళ్లిన పవన్ కల్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలసి పిఠాపురం రైల్వే స్టేషన్ వంటి అభివృద్ధి పనులపై చర్చించినప్పటికీ, ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు పవన్ కల్యాణ్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినప్పటికీ ఆయన వెంట మంత్రి నాదెండ్ల మనోహర్ ఉండేవారు. కానీ ఈసారి మాత్రం ఒంటరిగానే పవన్ హస్తిన పర్యటన రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.2019 ఎన్నికల్లో జనసేన ఓటమి తర్వాత పవన్ కల్యాణ్ అనేక సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. పొత్తుల విషయంలోనూ, మరొక సమయంలోనూ ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యేవారు. ఆయన వెంట ఖచ్చితంగా నాదెండ్ల మనోహర్ ఉండేవారు. ఈసారి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ సమయంలో నాదెండ్ల మనోహర్ లేకపోవడం ఒక రకంగా చర్చించాల్సిన అంశమేనంటున్నారు. అయితే అదే రోజు మంత్రి వర్గ సమావేశం ఉండటంతో నాదెండ్ల మనోహర్ ను తీసుకోకుండా ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అక్కడ జనసేన కు చెందిన ఇద్దరు ఎంపీలు ఉండటం వల్లనే ఆయన పర్యటనలోనాదెండ్ల లేరని పార్టీ వర్గాలు అంటున్నాయి.మరొకవైపు పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అయితే రాజకీయ పరమైన అంశాలు ఎక్కువగానే వీరి మధ్య చర్చకు వచ్చినట్లు కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రధానంగా కూటమి బలోపేతంపై చర్చించడంతో పాటు నియోజకవర్గాల పెంపుదలపై కూడా వీరి మధ్య చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. ఈసారి పొత్తుల విషయంలో ఎక్కువ స్థానాలు తీసుకునేలా బీజేపీ, జనసేనలు వ్యవహరించనున్నాయన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో పవన్ కల్యాణ్, అమిత్ షాల భేటీ ఏపీ రాజకీయాల్లో మరొకసారి వేడెక్కింది.

రెండు జిరాఫీల దత్తత

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన మాతృమూర్తి అంజనా దేవి జన్మదినం సందర్భంగా ఒక గొప్ప సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కును గురువారం సందర్శించిన ఆయన, అక్కడి రెండు జిరాఫీలను ఏడాది పాటు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు.జిరాఫీల దత్తత: జూలో ఉన్న రెండు జిరాఫీల సంరక్షణ బాధ్యతలను స్వీకరించిన పవన్ కల్యాణ్, వాటికి సంబంధించి ఏడాది పొడవునా అయ్యే ఆహార, ఇతర నిర్వహణ ఖర్చులను తానే స్వయంగా భరిస్తానని వెల్లడించారు. ఈ మేరకు దత్తత పత్రాలను జూ అధికారులకు అందజేశారు.జంతువులతో సందడి: జూ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ అక్కడి ఏనుగులు, జిరాఫీలకు స్వయంగా ఆహారాన్ని తినిపించారు. వన్యప్రాణుల పట్ల ఆయనకున్న మక్కువను చూసి జూ సిబ్బంది, పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు.కొత్త ఎన్‌క్లోజర్ ప్రారంభం: వన్యప్రాణుల సౌకర్యార్థం జూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను ఆయన ప్రారంభించారుజంతువుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు వన్యప్రాణులను దత్తత తీసుకుంటే జూ పార్కుల అభివృద్ధి సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

అమ్మ పుట్టినరోజున ఆడంబరాలకు వెళ్లకుండా ఇలా మూగజీవాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పవన్ కల్యాణ్ సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు.

# పవన్ ఎందుకు మౌనం



కడప, జనవరి 30, ఇటీవల జరిగిన విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందడం రాజకీయ వర్గాలనుగ్భ్రాంతికి గురి చేసింది. వివిధ పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. ఈ క్రమంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా మీడియా ముందుకు వచ్చి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. అజిత్ పవార్ మరణం చాలా బాధాకరమని, ఇది దేశానికి తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ ముఖంలో ఆ సమయంలో స్పష్టమైన విషాదం కనిపించిందిఅయితే అదే సమయంలో మీడియా ప్రతినిధులు జనసేనకు చెందిన ఒక ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణల గురించి ప్రశ్నించారు. కానీ పవన్ కళ్యాణ్ ఆ అంశంపై స్పందించకుండా అక్కడినుంచి వెళ్లిపోయారు. దీనినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా హైలైట్ చేస్తోంది. పవన్ కళ్యాణ్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని విమర్శలు గుప్పిస్తోంది. మరోవైపు జనసేన కార్యకర్తలు మాత్రం తమ నాయకుడు నిజంగా బాధలో ఉన్నారని, ఆ పరిస్థితిలో ఇతర అంశాలపై మాట్లాడకపోవడం సహజమేనని చెబుతున్నారు. అయినప్పటికీ ఈ వ్యవహారం రాజకీయంగా చర్చకు దారి తీసింది.రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అంశంలో జనసేన నాయకత్వం తీసుకున్న వైఖరిపై కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. కోనేటి ఆదిమూలంపై ఆరోపణలు వచ్చిన వెంటనే సస్పెన్షన్ వంటి నిర్ణయాలు తీసుకున్నారు. మరికొందరి విషయంలో విచారణ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు.అయితే జనసేన ఎమ్మెల్యే విషయంలో మాత్రం వివాదం చాలా రోజులుగా కొనసాగుతున్నా, పార్టీ స్థాయిలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమస్యను మౌనంగా ఎదుర్కోవడం, దిద్దుబాటు చర్యలు ఆలస్యం కావడం వల్ల పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ విలువలు, నైతికత, మంచి పాలన గురించి మాట్లాడుతుంటారు. కానీ అదే సమయంలో జనసేన నేతలపై కూడా లైంగిక వేధింపుల వంటి ఆరోపణలు రావడం ఆయన లక్ష్యాలకు విరుద్ధంగా మారుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.మంచి పాలన అందించాలన్న పవన్ కళ్యాణ్ ఆశయాన్ని కిందిస్థాయిలో కొందరు నేతల వ్యవహారాలు దెబ్బతీస్తున్నాయనే భావన ఉంది. ఈ పరిస్థితి ఆయనను వ్యక్తిగతంగా కూడా కలచివేస్తోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పార్టీ స్థాయిలో స్పష్టమైన విధానం, వేగవంతమైన చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే జనసేన ప్రజల్లో పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోగలదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

# ఏఐపై మోడీ మేధోమధనం

న్యూఢిల్లీ, జనవరి 30, (న్యూస్ పల్స్) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో భారత్ ఈ రంగంలో అగ్రగామిగా ఎదగడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక అడుగులు వేస్తున్నారు. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీల సీఈవోలు, ఏఐ నిపుణులతో ప్రధాని ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరిలో జరగనున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.భారతదేశం యూపీఐ ద్వారా ప్రపంచానికి తన సాంకేతిక నైపుణ్యాన్ని ఇప్పటికే నిరూపించుకుందని.. ఇప్పుడు ఏఐ రంగంలో కూడా అలాంటి విజయాలు సాధించాలని ప్రధాని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో స్వదేశీ ఏఐ సాంకేతికతను ప్రోత్సహించాలని, టెక్నాలజీలో స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ వద్ద ఉన్న డేటా వైవిధ్యం, ప్రజాస్వామ్య విలువలు ప్రపంచ దేశాలకు మనపై నమ్మకాన్ని కలిగిస్తాయని, అందుకే భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలనివిజ్ఞప్తి చేశారు.ఏఐ అభివృద్ధిలో కేవలం వేగం మాత్రమే కాదు.. భద్రత, పారదర్శకత కూడా ముఖ్యమని మోదీ స్పష్టం చేశారు. ఏఐ దుర్వినియోగం కాకుండా దాని వినియోగం పారదర్శకంగా, న్యాయంగా ఉండేలా పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాలని సూచించారు. యువతలో ఏఐనైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నిపుణులను కోరారు.ఈ సమావేశంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , విప్రో, హెచ్ సీఎల టెక్, జోహో కార్పొరేషన్, జియో ప్లాట్‌ఫామ్స్, అదానీ కనెక్స్ వంటి దిగ్గజ కంపెనీల లతో పాటు.. ఐఐటీ మద్రాస్,ఐఐటీ బాంబే,ఐఐటీ హైదరాబాద్ నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఈ చర్చల్లో భాగస్వాములై, ప్రభుత్వ మద్దతును వారికి వివరించారు.

# అభివృద్ధి బడ్జెట్...

విజయవాడ, జనవరి 30, ఏపీ బడ్జెట్‌కు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి నెలలో రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 11 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు జరుగనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. సమావేశాల తొలి రోజున రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తరువాతి రోజు అంటే 12న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 14న రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ (సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖకు సంబంధించిన బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు సమర్పించనున్నారు.2024 జూన్ 12న రాష్ట్రంలో టీడీపీనేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత 2025లో తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత బడ్జెట్‌లో మొత్తం వ్యయం మూడు లక్షల 22 వేల కోట్ల రూపాయలకు పైగా ఉండటం విశేషం. తొలిసారిగా రాష్ట్ర బడ్జెట్ మూడు లక్షల కోట్ల మైలురాయిని దాటింది. రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్న అంచనాలు, వివిధ రంగాల నుంచి వచ్చే ఆదాయంపై నమ్మకంతో ఆ బడ్జెట్‌ను రూపొందించారు.ఇప్పుడు రానున్న బడ్జెట్ గతాన్ని మించే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈసారి బడ్జెట్ పరిమాణం మూడున్నర లక్షల కోట్ల రూపాయల వరకు చేరవచ్చని చర్చ జరుగుతోంది. గత ఏడాది కాలంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం, పరిశ్రమలు ఏర్పాటు కావడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నాయి. అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌తో ప్రభుత్వం ముందుకెళ్తుండటంతో వ్యయ పరిమాణం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈసారి బడ్జెట్‌ను అభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా రూపొందించనున్నట్లు సమాచారం. అన్ని వర్గాలకు సమానంగా మేలు చేసేలా కేటాయింపులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి గణనీయమైన నిధులు కేటాయించే అవకాశముందని అంచనా. అలాగే పోలవరంప్రాజెక్టుకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం దక్కవచ్చని అంటున్నారు. సాగునీటి పారుదల రంగానికి ఈసారి బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది.సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమతూకంగా ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో బడ్జెట్ రూపకల్పన జరుగుతోందని సమాచారం. గత ఆర్థిక సంవత్సరం 2025?26లో వ్యవసాయ రంగానికి సుమారు 48 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. ఈసారి ఆ మొత్తాన్ని పెంచే అవకాశముందని చెబుతున్నారు. కనీసంగా 60 వేల కోట్ల రూపాయల వరకు వ్యవసాయ బడ్జెట్ ఉండొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.మొత్తంగా చూస్తే ఈసారి ఏపీ బడ్జెట్‌పై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఎక్కువ మొత్తాలు వివిధ రంగాలకు కేటాయించే అవకాశం ఉండటంతో రైతులు, యువత, పరిశ్రమల వర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్దేశించే కీలక మలుపుగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# హోంగార్డు..
# 15 ఏళ్లు 20 కోట్ల ఆదాయం...

విజయనగరం, జనవరి 30, ఇప్పటివరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు చేసిన తనిఖీలలో ఉన్నత హోదాలలో పనిచేసిన ఉద్యోగులు మాత్రమే దొరికారు. వారు మాత్రమే ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే అభియోగాలు ఎదుర్కొన్నారు. కానీ చరిత్రలో తొలిసారిగా ఓ హోంగార్డ్ అదాయానికి మించి కాదు.. అంతకుమించి అనే స్థాయిలో ఆస్తులను సంపాదించాడు. ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు రావడంతో సదరు హోంగార్డు మీద దృష్టి పెట్టారు. ఆ తర్వాత ఆయన బాగోతం కథలు కథలుగా బయటపడింది.అతడి పేరు శ్రీనివాసరావు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తూ ఉంటాడు. అతడు గతంలో ఏసీబీ శాఖలో దాదాపు 15 సంవత్సరాలుగా పనిచేశాడు. అతను పని చేస్తున్న క్రమంలో ముందుగా దాడుల గురించి సమాచారాన్ని సంబంధిత అధికారులకు చేరవేసేవాడు. తద్వారా వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. ఉన్నతాధికారుల అండతో.. వారికి రకరకాల సపర్యలు చేసి 15 సంవత్సరాల పాటు ఏసీబీలో ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాడు. 15 సంవత్సరాలు కాలంలో అతడు దాదాపుగా 20 కోట్ల వరకు ఆస్తులను కూడ పెట్టాడు.తన మీద ఏమాత్రం అనుమానం రాకుండా ఉండడానికి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించేవాడు. డబ్బులు కూడా నేరుగా తీసుకునేవాడు కాదు. అయితే ఇటీవల కాలంలో అతని ఆస్తులు అంతకంతకు పెరగడం.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇతడి గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావడంతో శ్రీనివాసరావు మీద దృష్టి పెట్టారు. అతడి ఆస్తులు.. వాడుతున్న ఫోన్లు.. ఖరీదైన లైఫ్ స్టైల్ చూసి ఉన్నతాధికారులు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత అన్ని వివరాలు సేకరించి గురువారం అతని ఇంట్లో సోదాలు మొదలుపెట్టారు.ఏసీబీ అధికారులు విజయనగరం, గుర్ల, విశాఖపట్నంలో తనిఖీలు నిర్వహించారు. దాదాపు 20 కోట్ల ఆస్తులను గుర్తించారు. ఖరీదైన ఇళ్ల స్థలాలు.. గృహాలు.. బంగారం, నగదు, వ్యవసాయ భూములు అతడు సంపాదించినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. అయితే ఇతడు సంపాదించిన ఆస్తులు మొత్తం కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే ఇటీవల కాలంలో అతడు ఖరీదైన వాహనాలలో తిరగడం పోలీసు ఉన్నతాధికారుల కంటపడింది. ఆ తర్వాత అతని గురించి వరుసగా ఫిర్యాదులు రావడంతో లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. అనంతరం అతడు సంపాదించిన సంపాదన.. చేస్తున్న లాబింగ్ వ్యవహారాలు మొత్తం పోలీసులకు తెలిసిపోయాయి. దీంతో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేయడంతో శ్రీనివాసరావు బండారం మొత్తం బయటపడింది

# పొత్తుల లెక్కలు తేలెదెలా...

ఖమ్మం, జనవరి 30, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోగా, ముఖ్యంగా అధికార కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తుల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులకు, ఇప్పటికి సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, తన మిత్రపక్షాలైన వామపక్షాలను కలుపుకుపోవడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ప్రస్తుతం పొత్తుల చర్చల్లో కొత్తగూడెం మున్సిపాలిటీ అత్యంత కీలకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గట్టి పట్టున్న సిపిఐ కొత్తగూడెంలో తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తోంది. మొత్తం 60 డివిజన్లలో తమకు కనీసం 30 స్థానాలు కేటాయించాలని ఆ పార్టీ పట్టుబడుతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి 17 స్థానాలకు మించి ఇవ్వలేమని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ఈ 13 స్థానాల తేడా ఇప్పుడు రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టింది. ఒకవేళ కాంగ్రెస్ తన పట్టు సడలించకపోతే, ఒంటరిగా బరిలోకి దిగడమే కాకుండా, తెలుగుదేశం వంటి ఇతర పార్టీలతో కలిసి వెళ్లేందుకు కూడా సిపిఐ సిద్ధమవుతోంది. ఇదే గనుక జరిగితే ఖమ్మం, నల్గొండ, వరంగల్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ ఓట్లకు గండి పడే ప్రమాదం ఉందనేది విశ్లేషకుల అభిప్రాయం.మరోవైపు సిపిఎం తీరు ఆసక్తికరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న ఈ పార్టీ, మున్సిపల్ ఎన్నికల్లో కొత్త మిత్రులను వెతుక్కునే పనిలో ఉంది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల సమయంలో కొన్ని చోట్ల బిఆర్ఎస్, సిపిఎం నేతల మధ్య అవగాహన కుదిరినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే ఫార్ములాను అమలు చేసే యోచనలో రెండు పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే కాంగ్రెసేతర పార్టీలన్నీ ఏకం కావాలనేది సిపిఎం అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది.ఈ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన పొత్తు ఉండకపోవచ్చు. స్థానిక బలాబలాలు, నాయకుల మధ్య ఉన్న సాన్నిహిత్యం ఆధారంగా పొత్తులు మారే అవకాశం ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల కాంగ్రెస్‌ను కాదని, రెండు కమ్యూనిస్టు పార్టీలు జతకట్టవచ్చు. నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొన్ని పట్టణాల్లో బిఆర్ఎస్, సిపిఎం మధ్య లోపాయికారీ ఒప్పందాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.వామపక్షాలు విడివిడిగా పోటీ చేస్తే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్‌కు చేటు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో కమ్యూనిస్టులకు కేడర్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. పొత్తులు కుదరకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు, మిత్రపక్షాల ఓట్లు కూడా చీలిపోయి ప్రతిపక్ష బిఆర్ఎస్ లేదా బిజెపికి లాభం చేకూరే అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ పార్టీకి ఇది కేవలం మున్సిపల్ ఎన్నిక మాత్రమే కాదు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పుగా మారుతుంది. అందుకే చిన్న పార్టీలను కూడా కలుపుకుపోవాల్సిన అవసరం ఆ పార్టీకి ఉంది. కానీ, సీట్ల సర్దుబాటులో ఇచ్చిపుచ్చుకునే ధోరణి లేకపోతే పొత్తులు పొడవటం కష్టమే.

మొత్తానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పొత్తుల గందరగోళం మధ్యే మొదలయ్యాయి. కొత్తగూడెం పీటముడి వీడితేనే కాంగ్రెస్-సిపిఐ బంధంపై స్పష్టత వస్తుంది.

సిపిఎం ఏ అడుగు వేస్తుందనేది బిఆర్ఎస్ వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. రానున్న రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల ఖరారు, బి-ఫామ్ ల పంపిణీ నాటికి ఈ రాజకీయ గందరగోళానికి ఒక తెర పడే అవకాశం ఉంది.

## రాష్ట్రం లోని పలు జిల్లాల్లో
## అవినీతి నిరోధక శాఖ దాడులు

విజయవాడ నెల్లూరు జిల్లా దగదర్తి తహసీల్దార్ పాలకృష్ణ ఇళ్లలో,అతని మిత్రులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ ఏక కాలంలో సోదాలు జరిపింది. పలు ఆస్తులు,నగదు గుర్తించింది. ఆదాయానికి మించి ఆస్తుల ఫిర్యాదులతో ఏపీలో ఏసీబీ వరుస దాడులు చేస్తోంది. గురువారం ఒకేసారి రెండు చోట్ల మెరుపు దాడులు చేసిన అధికారులు.. ఇవాళ నెల్లూరు జిల్లా దగదర్తి తహసీల్దార్ పాలకృష్ణ ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో 8 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. పాలకృష్ణ, అతని మిత్రులు, బంధువుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సోదాల్లో నగదు, బంగారం, ఇతర ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. న్యాయశాఖ ఉద్యోగులపై మరో ఫిర్యాదుతో ఐదు చోట్ల తనిఖీలు జరుగుతున్నాయి. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు...

# టార్గెట్ 150 ప్రారంభించేసిన జగన్



విజయవాడ, జనవరి 30, ఒకటిన్నర సంవత్సరం నేను పాదయాత్రతో ప్రజల మధ్యే ఉంటాను. 150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తాను. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం ఉండేది. మాట ఇస్తే దాన్ని నిలబెట్టుకోవాలన్న తపన, తాపత్రయం ఉండేది. చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలన్నీ రద్దైపోయాయని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అబద్దాలుగా తేలిపోయాయి. సంక్రాంతిరోజు చూస్తే.. ప్రభుత్వమా..? జంగిల్‌రాజ్ అన్నట్లు అనిపించింది. చూడాలి. సోషల్ మీడియాలో వీడియోలు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. మొబైల్ రికార్డింగ్ డ్యాన్సులు నడిపారు. తాగరా.. తాగి చిందేయరా.. అన్న రీతిలో జరిగాయి. అటవిక రాజ్యంలో ఉన్నామా అనిపిస్తోందని జగన్ అగ్రహం వ్యక్తం చేశారు.కోడి పందాలు నడపడానికి వేలం పాటలు నిర్వహించారు. పులివెందులలోనూ కోడిపందాలకు వేలంపాటలు పెట్టారు. ప్రభుత్వమే దగ్గరుండి చేయిస్తోంది.. వచ్చిన సొమ్మును ఎమ్మెల్యేలు, చంద్రబాబు, లోకేశ్, పోలీసు అధికారులు పంచుకున్నారని జగన్ ఆరోపించారు.భీమవరం డీఎస్పీ మాటలు వింటే ఆశ్చర్యంవేసింది. డీఎస్పీ ఊపేయ్.. కుదిపేయ్.. అంటున్నాడు. మనం ఏ సమాజంలో ఉన్నామో అర్ధంకావడం లేదు. రాష్ట్రం జంగిల్ రాజ్ అయ్యింది. బరితెగింపునకు అడ్డులేకుండా పోయింది. విచ్చలవిడిగా మనం ఊహించని స్థాయికి వెళ్లిపోయిందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన మహిళను బెదిరించి, భయపెట్టాడు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుందిసత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మహిళను బలాత్కారం చేసి చివరకు అధికార దుర్వినియోగం కేసును క్లోజ్ చేయించుకున్నాడు. మంత్రి సంధ్యారాణి పీఏపై ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన మహిళ ఫిర్యాదు చేస్తే.. అరెస్టు చేయాల్సిందిపోయి, బాధిత మహిళను జైలుకు పంపారని జగన్ అన్నారు. మరో మంత్రి వాసంశెట్టి సుభాష్ రికార్డింగ్ డ్యాన్సులు వేశాడురాష్ట్రం జంగిల్ రాజ్ లా మారిపోయిందని జగన్ అన్నారు.పాదయాత్రపై జగన్ మాట్లాడుతూ.. ఒకటిన్నర సంవత్సరం నేను పాదయాత్రతో ప్రజల మధ్యే ఉంటాను. 150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తాను. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గతంలో నేను కూడా పాలనమీద ఎక్కువ దృష్టి పెట్టాను. కార్యకర్తలకు చేయాల్సింది చేయలేకపోయి ఉండొచ్చు. ఇప్పుడు కార్యకర్తలకే పెద్దపీట ఉంటుంది. కార్యకర్తల ద్వారా ప్రజలకు మరింత మంచి జరిగేలా ఉంటుందని జగన్ అన్నారు.

# ఈటెల కేసీఆర్ కు దగ్గరవుతున్నారా

హైదరాబాద్, జనవరి 30, తెలంగాణ రాజకీయాల్లో ఈటల రాజేందర్ ఒక ప్రత్యేకమైన శైలి కలిగిన నేత. ఉద్యమ కాలం నుండి కేసీఆర్ వెన్నంటి ఉండి, ఆ తర్వాత అత్యంత నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) నుండి బయటకు వచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన తర్వాత కూడా ఆయన ప్రతి అడుగు ఆసక్తికరంగానే ఉంటోంది. తాజాగా నేరేడ్‌మెట్ అభివృద్ధి పనుల వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.ఈటల రాజేందర్ దాదాపు రెండు దశాబ్దాల పాటు కేసీఆర్ నాయకత్వంలో పనిచేశారు. రాజకీయాల్లో 'బాస్' అనే పదం ఒక నేత పట్ల ఉండే విధేయతకు గుర్తు. బీజేపీలో చేరిన తర్వాత కూడా కేసీఆర్‌ను 'బాస్' అని సంబోధించడం అనేది ఈటల మనసులో ఇంకా ఆ పాత జ్ఞాపకాలు ఉన్నాయని సూచిస్తోందా? లేదా బహిరంగ సభల్లో ప్రసంగించేటప్పుడు యాదృచ్ఛికంగా వచ్చిన మాటనా అనేది చర్చనీయం. అయితే, ఆయన మాట విన్న వెంటనే సభలో 'జై కేసీఆర్' నినాదాలు రావడం గమనార్హం. ఆయన మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్తారా అనే ప్రచారమూ సాగుతోంది.మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గ పరిధిలోని మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది. ఎంపీగా గెలిచిన ఈటల, ఇప్పుడు కేసీఆర్ పట్ల సానుకూల వ్యాఖ్యలు చేయడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌ను, ఓటర్లను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానాలు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటంలో విపక్షాలన్నీ ఏకం కావాలనే సంకేతం కూడా ఇందులో ఉండవచ్చు.నాకు కులం, మతం లేదు.. ప్రజలే నా బలం" అని ఈటల పేర్కొనడం ద్వారా తాను ఏ పార్టీలో ఉన్నా తనకంటూ ఒక సొంత ఇమేజ్ ఉందని ఆయన చాటిచెప్పారు. తన తల్లిదండ్రుల వారసత్వంతో కాకుండా సొంతంగా ఎదిగానని చెప్పడం ద్వారా అటు కేసీఆర్ కుటుంబ పాలనను, ఇటు వారసత్వ రాజకీయాలను ఆయన పరోక్షంగా విమర్శిస్తూనే, మరోవైపు కేసీఆర్ మార్కు రాజకీయాలను గౌరవిస్తున్నట్లు కనిపిస్తోంది.రాజకీయ వ్యాఖ్యలు పక్కన పెడితే, నేరేడ్‌మెట్ ఆర్‌యూబీ (ఖీజః), ఎల్‌హెచ్‌ఎస్ (ఒఊ‌ఆ) పనుల కోసం రూ. 80 కోట్లు మంజూరు చేయించడం ఈటల పనితీరుకు నిదర్శనం. ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న మల్కాజిగిరి ప్రజలకు ఇది పెద్ద ఉపశమనం.

కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో తాను సఫలమయ్యానని నిరూపించుకోవడం ద్వారా తన పదవికి న్యాయం చేస్తున్నానని ఆయన చాటుకున్నారు.

ఈటల రాజేందర్ వ్యాఖ్యలు బీజేపీలో కలకలం రేపవచ్చు, కానీ క్షేత్రస్థాయిలో ఆయన తన పట్టును నిలుపుకోవడానికి అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. "బాస్" వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# కమలం గేర్ మార్పు..

హైదరాబాద్, జనవరి 30, తెలంగాణ రాజకీయ యవనికపై ప్రత్యామ్నాయం మేమే అని విర్రవీగిన భారతీయ జనతా పార్టీకి, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఒక గట్టి హెచ్చరికను పంపాయి. ఒకప్పుడు రాష్ట్రంలో నెంబర్ 2 స్థానానికి ఎదిగామని, ఇక అధికారమే తరువాయి అని సంబరపడ్డ కమలదళానికి.. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఇంకా అట్టడుగునే ఉందన్న చేదు నిజం బోధపడింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు జరగబోతున్న మున్సిపల్ ఎన్నికలను బీజేపీ తన ఉనికి చాటుకునేందుకు, పోగొట్టుకున్న ప్రతిష్టను తిరిగి పొందేందుకు ఒక అగ్నిపరీక్షగా భావిస్తోంది.ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ అధిష్టానం ఈసారి వ్యూహాన్ని మార్చింది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర నాయకత్వానికి వదిలేసే కేంద్ర పెద్దలు, ఈసారి నేరుగా రంగంలోకి దిగుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తన కొత్త టీమ్‌తో ఇప్పటికే కసరత్తు ప్రారంభించగా, చాణక్యుడిగా పేరుగాంచిన అమిత్ షా స్వయంగా ప్రచార పర్వంలో పాల్గొంటుండడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.ఫిబ్రవరి 2, 3 తేదీల్లో మహబూబ్ నగర్ లేదా ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నిర్మల్ పట్టణాల్లో వీళ్ల భారీ బహిరంగ సభలకు ఏర్పాట్లు జరుగుతుండటం.. బీజేపీ ఈ ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేస్తోంది. మున్సిపాలిటీలపై జెండా ఎగురవేస్తే తప్ప, వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలుపు సాధ్యం కాదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు.బీజేపీ వెనుకబాటుకు ప్రధాన కారణం బయటి శత్రువుల కంటే ఇంట్లోని విభేదాలే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో పాత నాయకులకు, కొత్తగా చేరిన వలస నాయకులకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా స్థాయిలో గ్రూపు రాజకీయాలు పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ వంటి జిల్లాల్లో ఇటీవల జరిగిన దాడులు, గొడవలే ఇందుకు నిదర్శనం. అధిష్టానం ఎన్ని ఆదేశాలిచ్చినా, రాష్ట్ర నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. ఈ చలనం లేని కేడర్‌లో జోష్ నింపేందుకే అమిత్ షా వంటి అగ్రనేతలను బరిలోకి దించుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన సీట్లు రాకపోవడం, పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగినా అది విజయతీరాలకు చేర్చకపోవడంతో పార్టీ మేధోమథనంలో పడింది.మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఈసారి 'అర్బన్ ఓటర్ల'పైనే ఆశలు పెట్టుకుంది. కేంద్ర పథకాల లబ్ధిదారులు, మధ్యతరగతి ప్రజలే తమను గట్టెక్కిస్తారని నమ్ముతోంది. నితిన్ నబీన్ నాయకత్వంలో మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ వంటి నేతలను ఇన్‌ఛార్జులుగా నియమించడం ద్వారా ఇతర రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలను ఇక్కడ అమలు చేయబోతున్నారు.అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల మధ్య బీజేపీ తన స్థానాన్ని ఎలా కాపాడుకుంటుందనేది ప్రశ్నార్థకం. కేవలం అగ్రనేతల పర్యటనలతోనే ఓట్లు రాలతాయా? లేక గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి నాయకత్వం ఐక్యంగా ముందుకు సాగుతుందా? అనేది వేచి చూడాలి.బీజేపీకి ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదు.. తెలంగాణలో ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపు. అమిత్ షా రాకతో పార్టీలో జోష్ రావచ్చు కానీ, ఆ జోష్ ఓట్ల రూపంలోకి మారాలంటే స్థానిక నేతలు అహంభావాన్ని వీడి ఐక్యంగా పనిచేయాల్సి ఉంటుంది. లేదంటే నెంబర్ 2 కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# కాంగ్రెస్ సెల్ఫ్ గోల్...

హైదరాబాద్, జనవరి 30, మున్సిపల్ ఎన్నికల వేళ సిట్ అధికారులు బీఆర్ఎస్ కు సానుభూతి తెచ్చేందుకు నడుంకట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు ఇచ్చివిచారణకు పిలవడం మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. కాంగ్రెస్ శ్రేణులు ఇదే భయపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు చోటు చేసుకున్న కీలక పరిణామం మున్సిపల్ ఎన్నికల్లో కారు పార్టీకి కలసి వచ్చేటట్లు కనిపిస్తుంది. అరవై ఐదేళ్ల వయసులో పెద్దాయనను విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం పై కాంగ్రెస్ నేతలే లోలోపల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో చేయాల్సిన పని ఇదా? అంటూ కొందరయితే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.ఎంత లేదన్నా కేసీఆర్ తెలంగాణ సాధించిన వ్యక్తిగా నేటికీ ప్రజల్లో చెరగని ముద్ర ఉంది. ఆయన అవినీతి, ఆరోపణలు గత రెండేళ్ల నుంచి ఏ మాత్రం నిరూపించలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఏంటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురవుతుందంటున్నారు. కాళేశ్వరంలో కోట్ల రూపాయలు అవినీతిజరిగిందని ఆరోపణలు చేసి.. కొన్ని నెలల పాటు కమిషన్ తో కాలం గడిపి, తర్వాత నింపాదిగా సీబీఐకి ఇస్తున్నట్లు చెప్పేయడంతోనే అందులో డొల్లతనం బయటపడిందన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. కాళేశ్వరం అవినీతిని తేల్చలేని వాళ్లు ఇక ఫోన్ ట్యాపింగ్ కేసులో సాధించిందేమటన్న ప్రశ్నను బీజేపీ నేతలు కూడా ప్రశ్నిస్తున్నారు.ఒకరకంగా పెద్దాయనను ఇలా విచారణ పేరిట వేధించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టమే కాని, ఎటువంటి ప్రయోజనాలు ఉండవన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. రేపు ఆయన ఇంట్లో విచారణ చేసినా బీఆర్ఎస్ నేతలు చేసే హడావిడితో కొంత సానుభూతి ఆ పార్టీకి వస్తుందని, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇది అవసరమా? అన్న ప్రశ్న కూడా కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల నుంచి వినిపిస్తుంది. బీజేపీ నేతలు చెబుతున్నట్లు ఇందులో సిట్ అధికారుల కానీ, ప్రభుత్వం కానీ సాధించిందేమీ ఉండదని, కాలయాపన కోసమే ఇటువంటి నోటీసులు ఇవ్వడం, పార్టీకి నష్టంకొని తెచ్చుకోవడం ఎందుకని ప్రశనిస్తున్నారు. మొత్తం మీద కేసీఆర్ ను రేపు విచారించినా తేలేది ఏముంటుందో తెలియదు కానీ.. మున్సిపల్ ఎన్నికల్లో దెబ్బ తగలడం ఖాయమన్న వ్యాఖ్యలు గాంధీ భవన్ నుంచే వినిపిస్తుండటం విశేషం.

# రజనీకాంత్ బయోపిక్ రెడీ...



చెన్నై, జనవరి 30, కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ అంటే ఉండే క్రేజ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పని లేదు. ఆయన వాకింగ్ స్టైల్, డ్యాన్స్‌కే కోట్లాది మంది అభిమానులు ఫిదా అయ్యారు. బస్ కండక్టర్ స్థాయి నుంచి స్టార్‌గా ఎదిగిన ఆయన ప్రయాణం ఇండస్ట్రీలో ఎందరికో స్ఫూర్తి. ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై రానుందంటూ ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా దీనిపై ఆయన కుమార్తె ఐశ్వర్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.రజనీ కాంత్ బయోపిక్‌పై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఐశ్వర్య ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పారు. తన తండ్రి ఆటో బయోగ్రఫీ వర్క్ ఇప్పటికే ప్రారంభం అయినట్లు తెలిపారు. ఇది రిలీజ్ అయ్యాక వరల్డ్ వైడ్‌గా ఓ సెన్సేషన్ అవుతుందని అన్నారు. దీంతో అభిమానుల్లో ఓ కొత్త ఉత్సాహం నెలకొంది. అయితే, ఈ బయోపిక్‌లో ఎవరెవరు నటిస్తున్నారు? ఎవరు డైరెక్ట్ చేయబోతున్నారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. ఇండస్ట్రీలో ఏఐ వినియోగం మంచిదే అయినా అది ఎప్పటికైనా కృత్రిమమే అనేది గుర్తించుకోవాలన్నారు ఐశ్వర్య. అధునాతన టెక్నాలజీ సాయంతో 'కోచ్చాడయాన్ (2014)' వంటి విజువల్ వండర్ తెరకెక్కించగలిగామని చెప్పారు. వీలైతే భవిష్యత్తులో అలాంటి మూవీస్ తీయడం తనకు ఇష్టమని అన్నారు. '3', 'లాల్ సలామ్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య... 'విత్ లవ్' అనే మూవీకి నిర్మాతగా వ్యవహరించారు.ఈ మూవీలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా నటించగా... మదన్ దర్శకత్వం వహించారు. 'ఛాంపియన్' ఫేం అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించారు. ఫిబ్రవరి 6న సినిమా తెలుగులోనూ రిలీజ్ కానుంది. అటు, రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2'తో బిజీగా ఉండగా జూన్ 12న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

# సుస్మితకు 75 కోట్ల లాభం



చెన్నై, జనవరి 30, మెగాస్టార్ చిరంజీవి గురించి మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో తనకున్న రికార్డులు ఆయనను చాలా గొప్పగా పరిచయం చేస్తూ ఉంటాయి. 70 సంవత్సరాల వయసులో కూడా ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న యంగ్ హీరోలకు ఏమాత్రం తీసిపోకుండా సినిమాలను చేస్తున్న ఘనత తనకే దక్కుతుంది. అలాంటి చిరంజీవి రీసెంట్ గా 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించాడు. ఇక ఈ సినిమాకి తన కూతురు అయిన సుష్మిత ఒక ప్రొడ్యూసర్ గా కొనసాగిన విషయం మనకు తెలిసిందే. ఇక మరో ప్రొడ్యూసర్ గా సాహు గారపాటి వ్యవహరించారు. వీళ్ళిద్దరు కలిసి ఈ సినిమా కోసం 150 కోట్ల బడ్జెట్ ను కేటాయించారు. ఇందులో సుష్మిత కొణిదల 75 కోట్ల వరకు బడ్జెట్ పెట్టినట్టుగా తెలుస్తోంది.అయితే ఈ సినిమా ఇప్పుడు 400 కోట్ల మార్క్ ను టచ్ చేస్తున్న క్రమంలో దాదాపు 200 కోట్ల వరకు రిటర్న్స్ వచ్చే అవకాశాలైతే ఉన్నాయి. అంటే తను పెట్టిన పెట్టుబడి 75 కోట్లు తీసేస్తే ఆమెకు దాదాపు 125 కోట్ల వరకు ప్రాఫిట్ అయితే వచ్చినట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా కూడా చిరంజీవి తన కూతుర్ని స్టార్ ప్రొడ్యూసర్ గా మార్చాలనే ఉద్దేశ్యంతో తను చేస్తున్న ఈ కమర్షియల్ సినిమాకి ప్రొడ్యూసర్ గా వ్యవహరించమని చెప్పినట్టుగా తెలుస్తుంది.ఎలాగూ అనిల్ రావిపూడి చేసే సినిమా సక్సెస్ ని సాధిస్తుందని చిరంజీవికి తెలుసు?ఒకవేళ తేడా కొట్టిన కూడా ఈ సినిమా పెట్టిన బడ్జెట్ ను రికవరీ చేయగలదనే నమ్మకం చిరంజీవికి ఉంది. కాబట్టే సాహు గారపాటి గారితో కొలాబ్రేట్ చేసి మరి సుస్మిత ని ప్రొడ్యూసర్ గా పరిచయం చేశాడు.ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమా వల్ల సుష్మిత మంచి ప్రొడ్యూసర్ గా అవతరించిందే రాబోయే సినిమాలతో కూడా ఆమె సక్సెస్ ఫుల్ సినిమాలను చేయగలిగితే టాప్ ప్రొడ్యూసర్ గా మారుతుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు?

# మున్సిపల్స్..
## ఎవరి లెక్కలు వారివి

కరీంనగర్, జనవరి 30, తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వ పాలనకు రిఫరెండంగానే చూడాలి. ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మున్సిపాలిటీలు, నగరాల్లో కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతుండటంతో అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. అయితే ఎవరికి వారే గెలుపు పై ధీమాగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల తరహా మాత్రం కాదు. ఎందుకంటే పార్టీ సింబల్ మీద జరిగే ఎన్నికలు కావడంతో ఖచ్చితంగా పరిపాలన పై ప్రజా తీర్పు ఎలా ఉందన్నది స్పష్టంగా తెలుస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులుండవు కాబట్టి..ఎవరు గెలిచినా తమ వారిగా వారు చెప్పుకుంటారు.అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ మున్సిపల్ ఎన్నికలపై భారీ ఆశలు పెట్టుకుంది. పట్టణాల్లో పేదలతో పాటు తాము గత రెండేళ్ల నుంచి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి తమను గట్టెక్కిస్తాయని నమ్ముతుంది. మరొకవైపు మరో మూడేళ్లు అధికారంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉండటంతో తమ నగరాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ కే ఓటేయడమని ప్రజల ఆలోచన ఉంటుందని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో పాటు క్యాడర్ కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తుందని, అలాగే పట్టణ ఓటర్లు విజ్ఞతతో ఓటేస్తారని, అందుకే కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు పై ధీమాగా ఉంది. తమ నాయకత్వాన్ని కూడా పకడ్బందీగా రంగంలోకి దించింది.ఇక బీఆర్ఎస్ నాయకత్వం కూడా మున్సిపల్ ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరిస్తారని భావిస్తుంది. పట్టణ ఓటర్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారని, గత రెండేళ్లుగా ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరుతో పాటు అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు ప్రజల్లో పనిచేస్తాయని అంచనా వేస్తుంది. విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో తమకు తిరుగులేని ఆధిపత్యం దొరుకుతుందని భావిస్తుంది. మరొకవైపు పట్టణాల్లో తమకు తొలి నుంచి ఉన్న పట్టు ఖచ్చితంగా విజయావకాశాలను మెరుగు పరుస్తుందని చెబుతున్నారు. అయితే ఎలక్షనీరింగ్ చేయడమే ప్రధానమని, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే అతి పెద్ద టాస్క్ అని కారు పార్టీ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు.బీజేపీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకుంది. బీజేపీకి తొలి నుంచి పల్లెల కంటే పట్టణ ఓటర్ల మద్దతు ఎక్కువగా ఉంది. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలుపునకు కూడా ప్రధాన కారణం పట్టణ ఓటర్లేనని అంటున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ వెయ్యికి పైగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నామని, ఇక పట్టణాల్లో కమలం జోరును ఆపడం ఎవరి తరమూ కాదని ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. కేంద్ర నాయకత్వం కూడా మున్సిపోల్స్ పై దృష్టి పెట్టి రాష్ట్ర నాయకులను అప్రమత్తం చేసింది.

# రోడ్ మ్యాప్ రెడీ చేస్తున్న కవిత



హైదరాబాద్ జనవరి 30, తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. శాసనమండలిలో ప్రసంగించిన కవిత..ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నా..శక్తిగా తిరిగి చట్టసభల్లో అడుగు పెడతానంటూ శపథం చేసి వెళ్లారు. అసెంబ్లీ ముందున్న గన్ పార్క్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి.. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తానని ఆమె ప్రకటించారు.మరోవైపు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ ద్వారానే పోటీ చేస్తామని కవిత చెబుతూ వస్తున్నారు. తాను పెట్టబోయే పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తానని కవిత ప్రకటించారు. రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలస్యం అవుతుండటంతో..ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు కవిత.బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమం పేరుతో జిల్లాల పర్యటన చేస్తున్నారమె. మాజీ సీఎం జయలలితను గుర్తు చేసేలా..ఏకంగా కట్టు, బొట్టు అంతా లుక్‌నే మార్చేసి..జిల్లాల టూర్ చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ టార్గెట్ చేస్తూ కవిత ముందుకెళ్తున్నారు.ఇక ఇప్పుడు సొంత రాజకీయ పార్టీపై కవిత కసరత్తును వేగవంతం చేశారు. మెజార్టీ నేతలు తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చాలని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మరికొందరు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో టీఆర్ఎస్ వచ్చేలా చూడాలని కవితను కోరినట్టు సమాచారం. కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో..పాత టీఆర్ఎస్‌ను కొత్త పార్టీలో ఉండేలా చూడాలని సూచించారట. అందరి అభిప్రాయాలు తీసుకున్న కవిత..మార్చిలోనే కొత్త రాజకీయపార్టీని ప్రకటించనున్నట్లు జాగృతి వర్గాల టాక్.ఇప్పటికే జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో మెజార్టీ జిల్లాలను చుట్టేసిన కవిత.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని భావిస్తున్నారట. ఈ క్రమంలోనే ఫిబ్రవరి నెలాఖరులో మంచిర్యాలలో పెద్దఎత్తున జనం బాట ముగింపు సభను నిర్వహించాలని కవిత నిర్ణయించారు.మంచిర్యాల సభలో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించాలా, లేదంటే హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం దగ్గర ప్రకటించాలా అన్నదానిపై ఇంకా ఓ డెసిషన్‌కు రాలేదంటున్నారు. మార్చిలో రాజకీయ పార్టీ ప్రకటించిన వెంటనే తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని కవిత భావిస్తున్నారట. పాదయాత్రపై ఇప్పటికే కుటుంబ సభ్యులు, జాగృతి ముఖ్యనేతలతో చర్చించారట.పాదయాత్ర రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. తెలంగాణలోని అన్ని జిల్లాలు కవర్ అయ్యేలా మెజార్టీ అసెంబ్లీ స్థానాలను చుట్టివచ్చేలా పాదయాత్ర రోడ్ మ్యాప్‌ను రెడీ చేస్తున్నారట కవిత. దీంతో కవిత రాజకీయ పార్టీపై పొలిటికల్ సర్కిల్స్‌లోనే కాదు సామాన్య జనంలోనూ సర్వత్రా ఆసక్తి నెలకొంది

# తెలంగాణలో వ్యవసాయం భేష్...

హైదరాబాద్, జనవరి 30, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం.. ప్రస్తుతం 2.21 కోట్ల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. కేవలం తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ప్రధాన కారణంగా నిలిచాయి. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మరియు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు భూగర్భ జలమట్టాన్ని పెంచి, బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చాయి.పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడం విశేషం. సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా.. రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అంటే.. 2014 నుంచి 2023 మధ్య వరకు రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుందని సర్వేలో పేర్కొన్నారు. అంటే దాదాపు ఒక కోటి ఎకరాల అదనపు భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇది దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా నమోదైన అతిపెద్ద వృద్ధిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఇంతలా పెరగడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బహుళార్ధసాధక ప్రాజెక్టులు, జలవనరుల నిర్వహణ ప్రధాన కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది.అందులో ఒకటి మిషన్ కాకతీయ.. గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. దీనివల్ల బావులు, బోర్ల కింద సాగు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు .. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ద్వారా గతంలో ఎడారిగా ఉన్న ప్రాంతాలకు కూడా సాగునీరు అందింది. వీటితో పాటు.. చెక్ డ్యామ్‌ల నిర్మాణం , కాలువల ఆధునీకరణ ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు చేరుతోంది. వీటి ఫలితమే.. సాగు భూమి విస్తీర్ణం అధికంగా పెరిగింది. ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి ద్వారా.. భూ రికార్డుల ప్రక్షాళన, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ విభాగాల ఏకీకరణ వల్ల భూ యజమానులకు స్పష్టత వచ్చింది. ఇది రైతులు తమ భూములను మరింత సమర్థవంతంగా సాగు చేసుకునేలా ప్రోత్సహించింది.వ్యవసాయంతో పాటు తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటాను నమోదు చేసింది. ఇక ఐటీ, ఫైనాన్స్ సర్వీసులలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో కలిసి తెలంగాణ దేశంలో 40 శాతం వాటాను కలిగి ఉంది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటాతో దూసుకుపోతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.1 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్ల జారీలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. సాగు విస్తీర్ణం పెరుగుదల కేవలం ఆహార భద్రతనే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోందని నివేదిక పేర్కొంది.

# నకిలీ వైద్యుడు అరెస్ట్

హైదరాబాద్ .. ఉప్పల్ పిఎస్ పరిధి బీరప్పగడ్డలో అంజలి ఫార్మసీ అండ్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ పై ఉప్పల్ జోన్ ఎస్ఓటి పోలీసులు దాడి జరిపారు. నకిలీ డాక్టర్ బానోతు శ్రీను, ఫార్మసీ సర్టిఫికెట్ లేని మెడికల్ షాప్ నిర్వాహకుడు మదరపు కరుణాకర్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసారు. బీపీ ఆపరేటర్, సెథాస్కోప్, క్లినిక్ కు సంబంధించిన వస్తువులు, మెడికల్ షాప్ వస్తువులు, 4 గర్భ నిరోధక మాత్రల కిట్స్, ఇతర మెడిసిన్స్, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న పరికరాలు, వస్తులువు, ఉప్పల్ పోలీసులకు ఉప్పల్ జోన్ ఎస్ ఓటి పోలీసులు అప్పగించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

# బీసీలకు మొండి చేయి...?

హైదరాబాద్, జనవరి 30, సుదీర్ఘ కాలంగా బీసీలు తమ జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్ అమలు కావాలని ఎదురుచూస్తున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీల హక్కు సాకారం చేసుకునేందుకు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో బీసీ వర్గాల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్ర జనాభాలో పెద్ద వాటా ఉన్న బీసీ వర్గాలకు రాజకీయంగా, పరి పాలనాపరంగా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని అధికార పక్షం హామీ ఇచ్చింది.కానీ ఆ హామీ చట్టబద్ధ హక్కుగా మారకుండానే స్థానిక ఎన్నికల నిర్వహణ కొనసాగుతుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు జరుగనుండగా.. రిజర్వేషన్ల విషయంలో అదే వైఖరి కనిపిం చడంతో బీసీల హృదయాలను కలచివేస్తున్నది. ఎన్నికల వేళ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటూ ఆశలు రేపిన ప్రభుత్వం ఈ డిమాండ్‌ను అమలుచేసే దశలో స్పష్టత చూపించలేకపోతోందని బీసీలు ఆగ్రహిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో ప్రతిపక్షాలు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ కేవలం గాలిమాటేనా అని బీసీలు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని ఘనంగా ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు..అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని చట్టబద్ధంగా అమలు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు బీసీల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగ సవరణలు, జనాభా లెక్కలు, న్యాయపరమైన అడ్డంకుల పేరుతో నిర్ణయాలు వాయిదా పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది సాధారణమైన హామీ కాదు. బీసీల సామాజిక న్యాయానికి అది నిదర్శనం. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన పాలక పక్షం, ఆ హామీని చట్టంగా మార్చకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. కోర్టు ఆదేశాలు, జనగణన పేరుతో కాలయాపన జరిగింది. చివరకు పార్టీపరంగా టికెట్లు ఇచ్చి బీసీలకు న్యాయం చేసినట్టుగా ప్రచారం చేసింది. కానీ ఈ పరిస్థితి బీసీ వర్గాల్లో అనేక ప్రశ్నలకు దారితీసింది. నిజంగా బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలన్న రాజకీయ సంకల్పం ఉందా?, లేక ఎన్నికల ఒత్తిడిలో తాత్కాలిక పరిష్కారంతో సరిపెట్టుకున్నారా? అని అనుమానాలు వ్యక్తమయ్యాయి.పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు కొన్ని స్థానాలు దక్కినప్పటికీ అవి రిజర్వేషన్ వల్ల వచ్చిన హక్కులా?, లేక పార్టీ టికెట్ల పంపిణీలో భాగమా? అన్నది ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ అమలు కాకుండానే పంచాయతీ ఎన్నికలు జరగడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. పార్టీల అంతర్గత కేటాయింపుల పేరుతో కొంతమంది బీసీలకు అవకాశాలు ఇచ్చినా.. అది భరోసా కల్పించే రిజర్వేషన్ కాదని బీసీ నేతలు అంటున్నారు.పంచాయతీ ఎన్నికలతో బీసీ రిజర్వేషన్ అంశంపై ఆయా వర్గాల్లో పాలక, ప్రతిపక్షాల వైఖరిపై స్పష్టత వచ్చింది. రాజ్యాంగం, జనాభా లెక్కలు, న్యాయపరమైన చిక్కులు అంటూ కారణాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలు బీసీ వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ ఇవ్వకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శకులు అంటున్నారు.రిజర్వేషన్ అవసరమని నినాదాలు చేసి.. అమలు చేయాల్సిన సమయంలో మాత్రం చేతులెత్తేస్తారని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు లభించిన సీట్లు పార్టీ దయతో వచ్చిన అవకాశాలుగానే మిగిలాయని, దీంతో సరైన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం బలపడుతోంది. చట్టం ఉంటేనే ప్రతి బీసీకి సమాన అవకాశం లభిస్తుందని, లేకపోతే ఇది కేవలం ఎన్నికల హామీగా మిగిలిపోతుందని బీసీలు విమర్శిస్తున్నారు.42 శాతం రిజర్వేషన్ హామీ అమలవుతుందా? లేక మళ్లీ ఎన్నికల దాకా నినాదాలకే పరిమితమవుతుందా? అన్న ప్రశ్న బీసీ సమాజాన్ని వేధిస్తోంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్ అమలుచేయడంలో అన్యాయం జరిగిందని స్పష్టమవు తుంది. ఇప్పటివరకు ఓర్పుతో ఎదురుచూసిన బీసీ సంఘాలు, మేధావులు, యువత ఇప్పుడు చట్టబద్ధ రిజర్వేషన్ తప్ప మరే ప్రత్యామ్నాయం లేదని అభిప్రాయపడుతున్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు బీసీల రాజకీయ పోరాటం ముగియదన్న సంకేతాలు ఇస్తున్నారు.హామీలతో కాదు, చట్టంతోనే న్యాయం కావాలన్న డిమాండ్ మరింత బలపడుతోంది. పాలక, ప్రతిపక్షాలపై బీసీ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తి ఉద్యమంగా మారుతుందా.. లేక ఎన్నికల్లో రాజకీయ తీర్పుగా బయటపడుతుందా అని ప్రభుత్వంలోనూ ఆందోళన కలిగిస్తున్నది. 42 శాతం రిజర్వేషన్ కేవలం నినాదం కాదని, బీసీల రాజకీయ భవిష్యత్‌కు కీలక మలుపు అని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఈ అంశంలో ఇంకా జాప్యం జరిగితే భవిష్యత్ ఎన్నికల్లో బీసీల తీర్పు రాజకీయ చరిత్రను మార్చే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలటీలకు ఎన్నిలక నోటిఫికేషన్ విడుదల అయింది. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. కానీ ఇప్పటికీ బీసీల 42 శాతం రిజర్వేషన్‌పై చట్టపరమైన స్పష్టత లేదు. పంచాయతీ ఎన్నికల్లో చేసినట్లే మళ్లీ పార్టీపరమైన సర్దుబాట్లతో బీసీలకు న్యాయం చేసినట్టు చూపించాలని ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని బీసీలు ఆరోపిస్తున్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో పాలక, ప్రతిపక్షాలు ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శిస్తున్నారు.ఒకవైపు బీసీలే సామాజిక వెన్నెముక అంటూనే మరోవైపు వారి రాజకీయ హక్కులను చట్టంగా మార్చడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా బీసీల మద్దతు పొందుతూనే వారికి హక్కులు కల్పించేందుకు భయపడుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ వైఖరే పాలక, ప్రతిపక్షాలపై ఉన్న నమ్మకాన్ని చెరిపేస్తోందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బీసీ రిజర్వేషన్ అమలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టపరమైన మార్గాలు కనుగొనడం అసాధ్యం కాదని వాదిస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్ అమలు సాధ్యమైనప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కావడం లేదన్న ప్రశ్న బలంగా వినిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల్లోనూ బీసీలకు తీవ్ర నిరాశే ఎదురైందని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి మరోసారి బీసీలకు చేస్తున్న ద్రోహమేనని మండిపడుతున్నాయి. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తూ, అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెడుతున్నారన్న విమర్శలు రాజకీయంగా వేడెక్కుతున్నాయి.

## శ్రీనివాస ప్రసాద నిందా పరిహార హోమం చేసిన భూమన




తిరుపతిలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి శ్రీనివాస ప్రసాద నిందా పరిహార హోమం నిర్వహించారు. పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ కూటమి నేతలు ప్రచారం చేసిన తరువాత , లడ్డూలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని విచారణ తర్వాత సీబీఐ ఛార్జిషీట్ తేల్చేసింది. ఈ అపచారానికి పరిహారంగా తిరుపతిలోని తన నివాసానికి ఎదురుగా ఉన్న అన్నమయ్య భవనంలో కరుణాకర్ రెడ్డి హోమం చేసారు.




## రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి ఇంట్లో ఏసీబీ సోదాలు

### అక్రమాస్తుల కేసులో అటెండర్ తిరుమలేశ్‌పై చర్యలు
### రూ.50 కోట్లకు పైగా మార్కెట్ విలువైన ఆస్తులు గుర్తింపు
### 11 స్థిరాస్తులు, భారీగా బంగారం, వెండి స్వాధీనం
### తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఏకకాలంలో తనిఖీలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఇంట్లో రూ.50 కోట్లకు పైగా అక్రమాస్తులు బయటపడటం తీవ్ర కలకలం రేపింది. తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గ్రేడ్-3 ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న నల్లిపోగు తిరుమలేశ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ చూసి అధికారులే విస్మయానికి గురయ్యారు.అక్రమాస్తుల కేసులో కొద్ది రోజుల క్రితమే సస్పెన్షన్‌కు గురైన తిరుమలేశ్‌పై ఏసీబీ అధికారులు నిఘా పెట్టారు. గురువారం తిరుపతిలోని ఆయన నివాసంతో పాటు నెల్లూరు జిల్లా డీసీ పల్లెలోని ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మొత్తం ఐదు చోట్ల ఈ తనిఖీలు జరిగాయి.ఈ సోదాల్లో ఇప్పటివరకు 11 స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, 1.47 కిలోల బంగారం, 8.77 కిలోల వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ.15.26 లక్షల నగదు, ఇంట్లోని విలువైన ఫర్నిచర్, ఇతర గృహోపకరణాలను కూడా సీజ్ చేశారు. ఓ సాధారణ స్థాయి ఉద్యోగికి ఈ స్థాయిలో ఆస్తులు ఎలా సమకూరాయన్న కోణంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మమునూరు ఎయిర్ పోర్ట్ కోసం 300 ఎకరాల భూమిని అందించిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్ వరంగల్ మమునూర్ విమానాశ్రయ నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి 300 ఎకరాల భూమిని అందించింది. ?? కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భూమి పత్రాలు అందించిందారు. రెండున్నర సంవత్సరాల్లో విమానాశ్రయం నిర్మాణం పూర్తి చేస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి వైస్ చైర్మన్ ఎమ్మెల్సీ బండ ప్రకాష్, ఎంపీ కడియం కావ్య మరియు ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు పాల్గొన్నారు.

## పరిహారం ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వండి సిగాచి ప్రమాద బాధితుల పరిహారం

### ప్రభుత్వం పట్ల మరోసారి అసహనం వ్యక్తం చేసిన తెలంగాణ హైకోర్టు




హైదరాబాద్ సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వకపోవడం పై ప్రభుత్వం పై తెంలగాణ హైకోర్టు ఆసహనం వ్యక్తం చేసింది. పరిహారం ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వండని ఆదేశించింది. ఘటనలో మృతి చెందిన 56 మందికి, ఆచూకీ లభించని 8 మందికి, 28 మంది క్షతగాత్రులకు పరిహారం అందించడంతో పాటు, దర్యాప్తు కోసం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయాలని హైకోర్టులో బాబురావు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్ విచారిస్తూ, పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు, ఎంత ఇస్తున్నారు, ఎప్పుడు ఇస్తారు అంటూ హైకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు. పరిహారం పంపిణీకి సంబంధించిన అంశాలపై కంపెనీ వివరణ ఇవ్వాలని, దానికి సంబం ధించిన వివరాలను తెలియజేయాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు, చట్టప్రకారం అందాల్సిన పరిహారం వివరాలను సమర్పించాలని ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండళ్లను హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుమోటో ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీ చేసారు.

## జగన్ కి అధికారం సూట్ అవ్వలేదు వైఎస్ షర్మిలా రెడ్డి




విజయవాడ జగన్ పాదయాత్ర ఎందుకు ? అధికారం కోసమే కదా ఈ పాట్లు ? అధికారం ఇస్తే ఏం చేశారు ? వైఎస్సార్ జలయజ్ఞం పూర్తి చేయగలిగారా అని ఏపీసీసీ ఛీఫ్ షర్మిల ప్రశ్నించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. నవరత్నాల్లో పెట్టిన హామీలకు దిక్కులేదు. అధికారంలో వచ్చిన 6 నెలల్లో పూర్తి చేస్తా అన్నాడు. అధికారం ఇస్తే ఎందుకు పూర్తి చేయలేదు ? మద్యనిషేధం అన్నాడు. అధికారం ఇస్తే కల్తీ మద్యం పెట్టి , క్యాష్ పద్ధతిలో మద్య మాఫియా చేశాడని ఆరోపించారు. రుషికొండ వేల ఏళ్ల నుంచి నిలబడ్డ కొండ. రుషికొండ ను బోడి గుండు చేశాడు. అధికారం ఇస్తే ఒక్క రోజు కూడా బయటకు రాలేదు. ఆ పార్టీ వాళ్ళకే అందుబాటు లో లేదు. ఎన్నికలకి 6 నెలల ముందు బయటకు వచ్చి సిద్ధం అంటూ కొన్ని నెలలు తిరిగారు. అంతే తప్పిస్తే ఒకరోజు అయినా ప్రజల కోసం బయటకు వచ్చారా ? అబ్రహం లింకన్ ఒక మాట అన్నాడు. ఒక మనిషి నిజమైన నైజం తెలియాలి అంటే అధికారం ఇచ్చి చూడండి అన్నాడు . మనం జగన్ ని అధికారంలో చూశాం. జగన్ కి అధికారం సూట్ అవ్వలేదు . జగన్ కి పవర్ సూట్ అవ్వలేదు. జగన్ నేచర్ మారాలి. జగన్ నైజం మారాలి. జగన్ లో మార్పు రావాలి. జగన్ లో స్వార్థం తగ్గి మంచితనం పెరగాలి. అప్పుడు దేవుడు అధికారం ఇస్తాడేమో. అంతవరకు దేవుడు , ప్రజలు ఆశీర్వదించడు. ఏడాది న్నర తర్వాత చేసే పాదయాత్రకు ఇప్పుడు అనౌన్స్ ఎందుకు ? చిత్తశుద్ధి లేని యాత్రలు ఎందుకని ఆమె ప్రశ్నించారు.

## బాపూజీకి నివాళులు



హైదరాబాద్ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా బాపుఘాట్ వద్ద గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బాపూజీకి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

అహింసే ఆయుధంగా, సత్యమే మార్గంగా, శాంతియే సందేశంగా జాతికి దిశ చూపిన గాంధీజీ బాట. మనందరికీ నిరంతరం స్ఫూర్తిదాయకం. గాంధీజీ చూపిన బాటలోనే ప్రజా ప్రభుత్వం బాధ్యతాయుతంగా పాలన సాగిస్తోంది. ఆయన ఆలోచనలు నేటి ప్రభుత్వానికి దిశానిర్దేశం, స్ఫూర్తిని వక్తులన్నారు.

# ఏపీకి సహకరిస్తున్న రేవంత్ ప్రభుత్వం

## చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్న శిష్యుడు

### మాజీ మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్ రాజకీయాల కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. కాళోజీ ముందే ఊహించి చెప్పినట్లు.. ప్రాంతం వాడే తెలంగాణకు చేస్తున్న ద్రోహం ఇదని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు.

హరీష్ రావు మాట్లాడుతూ దేశ రాజధాని డిల్లీ కేంద్రంగా తెలంగాణకు జరుగుతున్న జల ద్రోహాన్ని వివరించేందుకే ఈ ప్రెస్ మీట్. ఒక వేళ ఆ తప్పు జరిగితే తెలంగాణ నీటి చరిత్రలో ఈరోజు ఒక బ్లాక్ డే గా మిగిలిపోతుంది.

గోదావరి నదీ జలాల అక్రమ తరలింపు విషయంలో ఃఖీూ మొదటి నుండి అప్రమత్తం చేస్తూనే వస్తుంది. గతంలో అనేక సార్లు ప్రెస్ మీట్ పెట్టినం. వాస్తవాలు బయట పెట్టినం. నామమాత్రంగా బ్యాక్ డేట్ వేసి లెటర్లు మీడియాకు విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. ముల్లు కర్రతో పొడుస్తూ మొద్దు నిద్ర లేపుతున్నమని అన్నారు.

అది బనకచర్ల అయినా, నల్లమల సాగర్ అయినా మారింది పేరు మాత్రమే కానీ, ఏపీ జల దోపిడి ఆగలేదు. జల ద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుది అయితే, పొడిచేది రేవంత్ రెడ్డి.

సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని అన్నారు.

ఈరోజు డిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ మీటింగ్ సాక్షిగా రేవంత్ ప్రభుత్వం మరణ శాసనం రాయబోతున్నది. పోలవరం నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరు గమనిస్తే... పోను పోను అనుకుంటూనే రేవంత్ రెడ్డి ఆనాడు డిల్లీ మీటింగ్ కు వెళ్ళాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకం పెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాసాడు. వేయను అంటూనే కమిటి వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీం కోర్టు కు వెళ్ళి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్ కు మద్దతు ప్రకటించాడు. దానికి వాపస్ తెచ్చుకున్నడు ఉత్తం. ప్లాన్డ్ గా సహకరిస్తూ చంద్రబాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నడు.

ఏపీ ఒత్తిడితో జరుగుతున్న మీటింగ్ లో నేడు ఇంజినీర్లు పాల్గొంటున్నారు. పేరుకు జలవివాదాల మీటింగ్ కానీ, మన 200 టీఎంసీలను గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టు సంబంధించిన కుట్ర ఇది. ఇలాగే గతంలో కేంద్ర జల్శక్తిశాఖ నిర్వహించిన సమావేశంలో ఏపీ ఈ ప్రాజెక్టునే ఏకైక ఎజెండాగా ముందుపెట్టింది. ఇప్పుడు కూడా ఏపీ నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నరు. బిఆర్ఎస్ నిలదీస్తే..డిసెంబర్ 30వ తేదీన నేను ఉత్తరం రాస్తే.. తెల్లారి ఒక మీటింగ్ రాసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అందులో ఏముంది.. ఏపీ నల్లమల సాగర్ విషయంలో ముందుకు పోతుంది, డిపిఆర్ ప్రక్రియ ముందుకు పోతుంది అని స్పష్టంగా రాసిందని అన్నారు.

దీంతో పాటు ఇంకేం రాసారు.. రెండు కండీషన్లకు ఒప్పుకుంటేనే ఢిల్లీ మీటింగ్ కు వస్తం అన్నరు. మొదటి కండీషన్ ఏమిటంటే నల్లమల సాగర్ కు డిపిఆర్ వెంటనే ఆపాలి, కేంద్రం అనుమతుల ప్రక్రియను తక్షణం ఆపాలి అని.. రెండోది.. ప్రీ ఫీజబులిటి రిపోర్టు ఆపినట్లు ఏపీ హామి ఇవ్వాలని రాసారు? నా ప్రశ్న ఏమిటంటే.. ఈ రెండు కండీషన్లకు కేంద్రం హామి ఇచ్చిందా? ఏపీ హామి ఇచ్చిందా? నీ అప్రువల్ తోనే లెటర్ పోయింది కదా ఉత్తం గారు ఎందుకు హామి లేకుండా పాల్గొంటున్నారు. ఎందుకు ఈరోజు మీటింగ్ కు ఎగేసుకొని పోయారు.

తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే రేవంత్ రెడ్డి పట్టించుకోడు, మీరైనా ఎందుకు పట్టించుకోరు ఉత్తం గారు. ఈ మీటింగ్ కు వెళ్లేది ఆదిత్యా నాథ్. గతంలో 9వ గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు మీటింగ్ లో పాల్గొన్న ఆదిత్యా నాథ్ దాస్, కాళేశ్వరం, గోదావరి, సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టు, తుపాకులగూడెం, మిషన్ భగీరథ, చనాక కొరటా, రామప్ప డైవర్షన్ లు అన్నీ అక్రమ ప్రాజెక్టులు, వీటిని నిలిపి వేయాలని చెప్పాడని అన్నారు.

తెలంగాణ ప్రాజెక్టులను అడుగడుగునా వ్యతిరేకించిన వ్యక్తిని మీటింగ్ కు పంపడం అంటే తెలంగాణ ద్రోహం చేయడానికే కదా? మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది.తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ దొరకలేదా? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోను పోను అంటూనే మీటింగ్ లకు అటెండ్ అవడం అంటే ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్ప చెప్పడమేనా మీ చర్చల లక్ష్యమా? కేసీఆర్ గోదావరిలో 400 టిఎంసీలు కేంద్రం నుంచి అనుమతులు తెచ్చారు. గోదావరి మీద 10 డిపిఆర్ లు పంపి 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు. రెండేళ్లలో ఒక్క డిపిఆర్ పంపింది లేదు, ఒక్క అనుమతి తెచ్చింది లేదు. వార్ధా, కాళేశ్వరం మూడో టిఎంసీలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డీపీఆర్ లు వాపస్ చేసింది. రేవంత్ రెడ్డి పాలనలో డిపిఆర్ లు వాపస్ వచ్చిన పరిస్థితి. మన డిపిఆర్ లు వాపస్ తెచ్చుకుంటవు, నల్లమల సాగర్ కు జెండా ఊపుతవు. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డి నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు. తెలంగాణ నీటి హక్కులను కాలరాసేందుకు ఏపీ ఒత్తిడితో కేంద్రం నిర్వహిస్తున్న ఈరోజు ఢిల్లీ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. నువ్వు పెట్టిన కండీషన్లకు వచ్చిన సమాధానం బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. రేవంత్ రెడ్డి.. నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని అన్నారు.

నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం మరో పోరాటం చేస్తం. కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. రెండు కోట్ల 20లక్షల ఎకరాల మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బిఆర్ఎస్ సాధించింది. బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మంచిది. కేంద్రంలోని మి ప్రభుత్వమే తెలంగాణ ప్రగతి పథాన్ని వివరించింది. కళ్లు తెరవండి అనవసరంగా బిఆర్ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి.

మేమేమో తెలంగాణకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తే, రేవంతు ఏపీకి నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేసిండు. నీటిని ఒడిసి పట్టింది కేసీఆర్ విడిచి పెట్టింది రేవంత్ సోయి లేని రేవంత్ నల్లమల సాగర్ కు జెండా ఊపుతున్నడు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం మీటింగ్ బాయికట్ చేయాలి. ఢిల్లీకి, దావోస్ కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదు. బిఆర్ఎస్ సేద్యంపై దృష్టి సారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని అన్నారు.

# డైవర్షన్ అని తెలిసినా డైవర్ట్ అవుతున్న బీఆర్ఎస్




హైదరాబాద్, జనవరి 30 తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయం ఒక ఆసక్తికరమైన మలుపు తీసుకుంది. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం డైవర్షన్ అనే పదం మార్మోగిపోతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యం కేవలం చర్చను మళ్లించడమేనని బీఆర్ఎస్ గట్టిగా నమ్ముతోంది. అయితే, ఇక్కడే ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇది డైవర్షన్ అని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు కూడా, చివరకు అదే అంశంపై చర్చించేలా కాంగ్రెస్ తన వ్యూహాన్ని అమలు చేయడంలో సఫలమైంది. సిట్ నోటీసులు, విచారణలు, అరెస్టుల చుట్టూనే రాజకీయం తిరుగుతుండటంతో.. బీఆర్ఎస్ యంత్రాంగం మొత్తం ఇప్పుడు ఆ కేసును ఎదుర్కోవడంలోనే నిమగ్నమైపోయింది.ఫిబ్రవరి 11న రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. వాస్తవానికి ఈ సమయానికి బీఆర్ఎస్ తన శ్రేణులను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేయాలి. కానీ, పార్టీ అధినేత కేసీఆర్ నుండి ద్వితీయ శ్రేణి నేతల వరకు అందరి దృష్టి ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసుపైనే ఉంది. మరోవైపు, కాంగ్రెస్ మాత్రం చాలా నిశ్శబ్దంగా, పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఇన్‌చార్జుల నియామకం, క్షేత్రస్థాయి సర్వేలు పూర్తి చేసిన రేవంత్ రెడ్డి సర్కార్, బీఆర్ఎస్‌ను ఈ కేసులో బిజీగా ఉంచి, తాము గ్రౌండ్ లెవల్‌లో క్లీన్ స్వీప్ చేయాలనే ప్లాన్‌తో ఉన్నట్లు కనిపిస్తోంది.ఎన్నికల సమయంలో చర్చకు రావాల్సిన స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులు ఇప్పుడు ఎక్కడా వినిపించడం లేదు. కాంగ్రెస్ విసిరిన ట్యాపింగ్ అస్త్రం బీఆర్ఎస్ చేతిలో ఉన్న ఇతర ఆయుధాలను నిర్వీర్యం చేసింది. సింగరేణి బొగ్గు కుంభకోణం లేదా ప్రభుత్వ వైఫల్యాల గురించి బీఆర్ఎస్ మాట్లాడదామనుకునే లోపే, సిట్ నోటీసులు వచ్చి చర్చా వేదికను మార్చేస్తున్నాయి. ఫలితంగా, బీఆర్ఎస్ డిఫెన్సివ్ మోడ్‌లోకి వెళ్లక తప్పడం లేదు. ఇది పరోక్షంగా కాంగ్రెస్‌కు ఎన్నికల ప్రచారంలో ఒక అడ్వాంటేజ్‌గా మారుతోంది.కేసీఆర్‌కు నోటీసులు అందడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన మొదలైంది. ఎన్నికలకు కేవలం రెండు వారాల ముందు పార్టీ అధినేత విచారణను ఎదుర్కోవాల్సి రావడం క్యాడర్ నైతిక బలాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. రాజకీయంగా దీనిని వేధింపులు అని ప్రచారం చేసినా, విచారణ ఎదుర్కోవడం అనేది అనివార్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం కేవలం ఫోన్ ట్యాపింగ్ కేసుకే పరిమితం కాకుండా, ఎన్నికల వ్యూహాలను ఎలా సమన్వయం చేసుకుంటుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.రాజకీయంగా చూస్తే, కాంగ్రెస్ ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యవహరిస్తోంది. అటు పాత కేసుల ద్వారా బీఆర్ఎస్ ప్రతిష్టను దెబ్బతీయడం, ఇటు ఎన్నికల వేళ ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం ద్వారా మున్సిపల్ పోరులో పైచేయి సాధించాలని చూస్తోంది. బీఆర్ఎస్ గనుక ఈ ట్రాప్ నుండి త్వరగా బయటపడి, ఎన్నికల ఎజెండాను మార్చలేకపోతే, మున్సిపల్ ఫలితాలు ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ అయ్యే ప్రమాదం ఉంది. డైవర్షన్ అని తెలిసినా, ఆ ఉచ్చులో పడకుండా తప్పించుకోవడం ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న అసలైన సవాల్.

# కళ్లకు గంతలు కట్టి దాడులు చేశారు

విజయవాడ, జనవరి 30 చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా తనకు అరెస్టులు, శిక్షలు తప్పడం లేదని వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే వ్యక్తిని కాదని, తన పోరాటం కొనసాగుతుందన్నారు. తామిద్దరూ ఒకే ఊరి నుంచి ఎదిగిన వారు కావడంతో, తన ఎదుగుదలను చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. 2014 నుండి 2019 వరకు తనపై సుమారు 72 కేసులు బనాయించి, చిత్తూరు జిల్లాలోని అన్ని జైళ్లకు తిప్పారని గుర్తుచేశారు.గతంలో తనను అక్రమంగా అరెస్టు చేసి కడప, నెల్లూరు సెంట్రల్ జైళ్లకు తరలించి కొట్టించారని, ఎమ్మెల్యేగా చేసిన తనను కళ్లకు గంతలు కట్టి తీసుకెళ్లి తిరువళ్ళూరు వద్ద దాడి చేశారని సంచలన ఆరోపణలు చేశారు. అసలు తనను చిత్తూరు నుంచి నెల్లూరుకు ఎందుకు తీసుకెళ్లారో కూడా ఇప్పటికీ తెలియదని చెవిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు సీఎం అవ్వగానే మళ్ళీ తనను అక్రమ కేసుల్లో ఇరికించి 8 నెలల పాటు జైల్లో నిర్బంధించారని చెవిరెడ్డి అన్నారు.తన కుటుంబంపై కూడా కక్ష సాధింపులు జరుగుతున్నాయని, ఎమ్మెల్యేగా పోటీ చేసిన తన పెద్ద కొడుకుపై ఇప్పటికే 10 కేసులు పెట్టారని, విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న చిన్న కొడుకును కూడా అరెస్టు చేస్తామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పుట్టిన ఊరిలో పుట్టడమే మేం చేసిన తప్పా? అని ప్రశ్నించారు. ఒకవేళ తన తల్లిదండ్రులు బతికి ఉంటే వారిపై కూడా కేసులు పెట్టేవారేమోనని ఎద్దేవా చేశారు. తాను రాజకీయాల్లోకి పైరవీలతో రాలేదని, పోరాటాల ద్వారా వచ్చానని స్పష్టం చేశారు.రాజారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి వంటి మూడు తరాల నాయకులతో కలిసి పని చేసిన అనుభవం తనకు ఉందని, ఎన్ని వేధింపులు గురిచేసినా, అసత్య ప్రచారాలు చేసినా తాను భయపడనని చెవిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇవన్నీ ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చిన తాను దేనికీ వెనకడుగు వేయబోనని స్పష్టం చేశారు. అక్రమ కేసులో 8 నెలలపాటు పాటు జైల్లో ఉంచినప్పటికీ, తన పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో వేల కోట్ల మద్యం కుంభకోణం జరిగిందన్న ఆరోపణలతో 2025 జూన్ 17న బెంగళూరు విమానాశ్రయంలో సిట్ (గామి) అధికారులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆయనను ఏ-38గా పేర్కొన్నారు. సుమారు 226 రోజుల పాటు విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు, వెన్నునొప్పి సమస్య కారణంగా ఉండవల్లిలోని మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి చికిత్సాలయంలో ఫిజియోథెరపీ చేయించుకునేందుకు ఏసీబీ కోర్టు 15 రోజుల పాటు అనుమతినిచ్చింది.

# 25వేలు వెండి, 10వేలు తగ్గిన బంగారం



ముంబై, జనవరి 30 గత కొన్ని రోజులుగా పరుగులు పెట్టిన బంగారం ధరల జోరుకు ఇవాళ ఒక్కసారిగా బ్రేక్ పడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. దేశీయంగా తులం బంగారంపై సుమారు రూ.8,000 వరకు తగ్గగా, కిలో వెండిపై రూ.15,000 మేర తగ్గుదల కనిపించింది.గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఈరోజు ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.8,230 తగ్గి రూ.1,70,620 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారెట్ల పసిడి ధర రూ.7,550 తగ్గి రూ.1,56,400కు చేరింది. వెండి ధర కూడా ఇదే బాటలో పయనించింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.10,000 తగ్గి రూ.4,15,000గా ఉంది.ఇటీవల ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు సైతం బంగారం కొనుగోలుకు ఎగబడిన విషయం తెలిసిందే. అయితే, నేటి ఆకస్మిక పతనం కొనుగోలుదారులను కొంత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు పసిడి ధర సుమారు 70 శాతం పెరిగింది. ప్రస్తుత తగ్గుదల తాత్కాలికమేనని, దీర్ఘకాలంలో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 22 ఇస్లామిక్ దేశాలతో సమావేశం

## వాణిజ్యం, శక్తి, విద్య, సంస్కృతి, దౌత్యంపై చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 30 ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్లామిక్ దేశాల నాయకులు భారత రాజధాని ఢిల్లీలో సమావేశమవుతున్నారు. దాదాపు 20 సంవత్సరాల తర్వాత ఈ సమావేశం తొలిసారిగా జరగనుంది. దీనికి భారతదేశం ? యుఎఇ సంయుక్తంగా అధ్యక్షత వహిస్తున్నాయి. భారతదేశం ? అరబ్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, భాగస్వామ్యానికి కొత్త దిశానిర్దేశం చేయడం ఈ సమావేశం లక్ష్యం. 22 అరబ్ దేశాల విదేశాంగ మంత్రులు ఈ సమావేశంలో పాల్గొంటారు.దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఈ సమావేశానికి భారతదేశం ఆతిథ్యం ఇస్తోంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ అందించింది. అన్ని అరబ్ లీగ్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు, అరబ్ లీగ్ సెక్రటరీ జనరల్ కూడా పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశానికి ముందు భారత్ మండపంలో సీనియర్ అధికారుల సమావేశం కూడా జరుగుతోంది. 10 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో జరుగుతున్న మొదటి సమావేశం ఇది. మునుపటి సమావేశం 2016 లో జరిగింది. అయితే ఆ సమయంలో అది బహ్రెయిన్‌లో జరిగింది. అరబ్ దేశాల సంస్థ అయిన లీగ్ ఆఫ్ అరబ్ స్టేట్స్ లో భారతదేశం పరిశీలకుడుగా ఉన్నారు. ఈ సంస్థలో మొత్తం 22 సభ్య దేశాలు ఉన్నాయిఅరబ్ దేశాల సమితి 1945 మార్చి 22న కైరోలో ఏర్పడింది. ప్రారంభంలో, ఈ సంస్థలో ఈజిప్ట్, ఇరాక్, జోర్డాన్, లెబనాన్, సౌదీ అరేబియా, సిరియా మాత్రమే ఉన్నాయి. ఇది ఏడుగురు సభ్యులతో ప్రారంభమైంది. ప్రస్తుతం, ఇది ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలతో సహా అరబ్ ప్రపంచం నుండి 22 మంది సభ్యులుగా ఉన్నారు. సిరియాను తిరిగి చేర్చుకున్నారు. లీగ్‌లో అర్మేనియా, బ్రెజిల్, చాడ్, ఎరిట్రియా, గ్రీస్, భారతదేశం, వెనిజులా వంటి పరిశీలక దేశాలు కూడా ఉన్నాయి.భారతదేశం ? అరబ్ దేశాలు దీర్ఘకాలిక సంబంధాలను కలిగి ఉన్నాయి. వాణిజ్యం, శక్తి, విద్య, సంస్కృతి, దౌత్యం వంటి అనేక రంగాలలో బలమైన సహకారం ఉంది. భారతదేశం-అరబ్ వాణిజ్యం 240 బిలియన్ డాలర్లను దాటింది. భారతదేశం తన చమురు, గ్యాస్, ఒఖఉ అవసరాలలో ఎక్కువ భాగాన్ని అరబ్ దేశాల నుండి సేకరిస్తుంది. అదే సమయంలో, 9 మిలియన్లకు పైగా భారతీయులు అరబ్ దేశాలలో పనిచేస్తున్నారు.ఈ సమావేశంలో, వాణిజ్యం, ఇంధనం, విద్య, సాంకేతికత, మీడియా, సంస్కృతిలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడం గురించి ఇరుపక్షాలు చర్చించనున్నాయి. భారతదేశం ఇప్పుడు దీనికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా అరబ్ దేశాలతో తన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశానికి ముందు, పాలస్తీనా విదేశాంగ మంత్రి వర్షేన్ అఘాబెకియన్ షాహిన్, గాజా పునర్నిర్మాణంలో భారతదేశం మరింత సహాయం అందించాలని, పాలస్తీనా శరణార్థుల కోసం జఔఖీచింకి మద్దతు ఇవ్వడం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం ఎల్లప్పుడూ పాలస్తీనాకు మద్దతు ఇస్తుందని, రెండు దేశాల పరిష్కారం, పాలస్తీనా హక్కులు, అంతర్జాతీయ చట్టానికి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. నేడు భారతదేశం ఇజ్రాయెల్ ? పాలస్తీనా రెండింటికీ స్నేహితుడిగా ఉందని, రెండింటి మధ్య శాంతికి మధ్యవర్తిగా ముఖ్యమైన పాత్ర పోషించగలదని షాహిన్ అన్నారు.విద్యా రంగంలో భారతదేశం అనేక ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చిందని పాలస్తీనా విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. వెస్ట్ బ్యాంక్‌లోని అనేక పాఠశాలలు భారత సహాయంతో పనిచేస్తున్నాయి. గాజాలో కొన్ని ఇటీవలి సంఘర్షణలో ధ్వంసమయ్యాయి. ఈ సమావేశంలో ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, గాజా కోసం శాంతి ప్రణాళిక గురించి కూడా చర్చించనున్నట్లు వర్గాలు తెలిపాయి.సభ్య దేశాల విదేశాంగ మంత్రులతో కూడిన ఈ కౌన్సిల్ ప్రధాన రాజకీయ విభాగం, సంవత్సరానికి రెండుసార్లు సమావేశమవుతుంది. ప్రతి సభ్యునికి ఒక ఓటు ఉంటుంది. అనుకూలంగా ఓటు వేసే దేశాలపై మాత్రమే నిర్ణయాలు ఉంటాయి. లీగ్ మెజారిటీ నియమం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటుంది. అయితే, సమ్మతిని అమలు చేయడానికి దీనికి యంత్రాంగం లేదు. ప్రధాన అంతర్జాతీయ సమస్యలపై అంతర్గత సంఘర్షణలు, సమిష్టి నిష్క్రియాత్మకత కారణంగా ఇది విమర్శలను ఎదుర్కొంది. ఒయా ంజ, ఇజ, యాఇంఔ, దక్షిణ అమెరికా దేశాల యూనియన్‌తో బహుపాక్షిక సంబంధాలను కొనసాగిస్తుంది.

# ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మూడో డివిజన్ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కొమరగిరి సత్యవతి సుమన్

### మూడవ డివిజన్ అభ్యర్థిగాగా కొమరగిరి సత్యవతి సుమన్ గెలుపు లాంచనమే



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 30 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలో గల ఎదులాపురం మున్సిపాలిటీ మూడో డివిజన్ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా కొమరగిరి సత్యవతి సుమన్ నామినేషన్ దాఖలు చేశారు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మూడో డివిజన్ నాయుడుపేట ప్రాంతం కొమరగిరి సత్యవతిసుమన్ ప్రజలతో మమేకమైతు నిత్య ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు మూడవ డివిజన్ నాయుడుపేట కౌన్సిలర్ బీసీ మహిళ కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆశవహుల సంఖ్య ఎక్కువగా ఉంది కాంగ్రెస్ పార్టీ నుంచి మరొకరు నామినేషన్ దాఖలు చేశారు కానీ కొమరగి సత్యవతి సుమన్ రాజకీయ జీవితంలో ఆధ్యాత్మిక ఉత్సవాలలో ప్రజా సేవలో ముందున్నారు ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఆపద వచ్చిన ఆదుకునే మనస్తత్వం కలవారు దీంతో నాయుడుపేట ప్రాంతంలో కొమరగిరి సత్యవతి సుమన్ అంటే ఒక బ్రాండ్ గా పేరు ఉన్నది గత రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేని నేత గా పేరు తెచ్చుకున్నారు గతంలో అధికార పార్టీ ఏలాంటి ప్రలోభాలు పెట్టిన తను నమ్ముకున్న పార్టీ కోసం తనపై నమ్మకం ఉంచిన ప్రజల కోసం పనిచేశారు కొమరగిరి సత్యవతిసుమన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయితే గెలుపు ఏకపక్షం గా ఉంటుందన్న టాక్ సైతం వచ్చేసింది మూడోవ డివిజన్ నాయుడుపేట ప్రాంతంలో గ్రామంలో కొమరగిరి సత్యవతి సుమన్ గెలుపు నల్లేరు పై నడకేనని రాజకీయ నాయకులు రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు కానీ అధిష్టానం ఎవరి వైపు మొగ్గ చూపుతుందో వేసి చూడాల్సిన పరిస్థితి నాయుడుపేట లో ఉంది అని విశ్లేషణలు భావిస్తున్నారు నామినేష్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండ మల్లయ్య సూదగాని జగదీష్ లక్ష్మీనారాయణ రవికుమార్ శ్రీరాములు దావా శీను షేక్ సాజిదా దామోదర్ సాయికిరణ్ కార్యకర్తలు అభిమానులు బంధువులు తదితరులు పాల్గొన్నారు

## అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ఖర్చులు వెల్లడించాలి: జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. వీరా రెడ్డి



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులంతా తమ ఎన్నికల ఖర్చుల వివరాలను తప్పనిసరిగా నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. వీరా రెడ్డి తెలిపారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్‌తో కలిసి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులకు ఎన్నికల వ్యయాలపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ఖర్చులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అన్ని రకాల ఫారాలు, రిజిస్టర్లను సక్రమంగా పూరించాలన్నారు.


ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు షుజావుద్దీన్, డీఈవో భోజన్న, డీసీఓ నర్సయ్య, అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల కమిటీ ని సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఏర్పాటు




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 30 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జోగిపేట యందు, కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ పి రమేష్, అనుమతితో కళాశాలలోని, అతిథి అధ్యాపకులు, 2026-27, విద్యా సంవత్సరానికి గాను, అతిధి అధ్యాపకుల కమిటీని, సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కమిటీలో అధ్యక్షులుగా, సిహెచ్, అంజిబాబు, ఉపాధ్యక్షురాలుగా, వి, కల్పన, ప్రధాన కార్యదర్శిగా, పి,మాధవి, కోశాధికారిగా, టీ, విద్యాసాగర్, గారిని కమిటీ సభ్యులు, ఎం, అజిత, డి, కీర్తన, బి, రాజేశ్వరి, ఎం, ప్రభాకర్, బి, శివకుమార్ను, నిర్ణయించడం జరిగింది.......

## వేములవాడ మున్సిపాలిటీలో భారీగా దాఖలైన నామినేషన్లు.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో మూడవరోజు శుక్రవారం రోజున 154 నామినేషన్లు దాఖలు అయినాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ 47, బిజెపి పార్టీ 37, బి ఆర్ఎస్ పార్టీ,43, ఇండిపెండెంట్ అభ్యర్థులు 21 మంది, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నుండి 3, సిపిఐ పార్టీ నుండి ఒక్కరు, ఏఐఎస్ఎఫ్ నుండి ముగ్గురు మొత్తం 154 నామినేషన్లు దాఖలు అయినాయి.

వేములవాడ మున్సిపల్ లో మొదటి రోజున దాఖలైన నామినేషన్లు 16, రెండవ రోజు దాఖలైన నామినేషన్లు 90, మూడవరోజు దాఖలైన నామినేషన్లు 154, మూడు రోజులలో మొత్తం దాఖలైన నామినేషన్లు 260 అయినట్లు మున్సిపల్ ఎన్నికల అధికారి తెలిపారు. 31వ తేదీ జనవరి శనివారం రోజున నామినేషన్ల స్క్రూటీని జరగనుంది.

# అర్జుని గ్రామంలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

## మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** గాదిగూడ మండలం అర్జుని గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (వీరాబా)లో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులంతా సాదర స్వాగతం పలికారు.

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గాదిగూడ మండలంలోని రహదారుల పరిస్థితిని మెరుగుపరిచి, ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

గ్రామంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని, గృహ నిర్మాణ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

అనంతరం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆహార హారపదార్థాలను కలెక్టర్ రుచి చూసారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమలాబాయి, పటేల్ ?రావుజీ పటేల్, తహసిల్దార్ ?సత్యనారాయణ, ఎంపీడీవో ?శ్రీనివాస్, ఎంపిఓ?గంగాధర్, ఏంఈఓ ?రమేష్, ప్రధానోపాధ్యాయులు ?మెస్రం శేఖర్, రాయ్ సెంటర్ సార్ మేడి ?మండాడి దౌలత్ రావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నార్నూర్ మండలం లోకారి (కె) గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖాముఖి కార్యక్రమం



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** నార్నూర్ మండలం లోకారి (కె) గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, అధికారుల తీరుపై లబ్ధిదారుల నుండి వివరాలను సేకరించారు.

ఇటీవల నార్నూర్ మండలంలో ఏఈ (హౌసింగ్) ఒకరు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో, సదరు అధికారి గతంలో ఈ ప్రాంతంలో పని చేసినందున ఇక్కడి లబ్ధిదారులను ఆయన విచారించారు. ఇళ్ల మంజూరులో కానీ, బిల్లుల చెల్లింపులో కానీ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? ఇసుక సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. దీనిపై లబ్ధిదారులు స్పందిస్తూ, తమ వద్ద ఎవరూ డబ్బులు ఆశించలేదని, పనులు సజావుగానే సాగుతున్నాయని అధికారులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ గణేష్ ఇతర ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికల్లో 28వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూకల రామ్మోహన్ రెడ్డి నామినేషన్ దాఖలు



**ఖమ్మం ప్రతినిధి జనవరి 30 (ప్రజాబలం)** రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సూచనలతో ఏదులాపురం మున్సిపాలిటీ 28వ వార్డు కౌన్సిలర్ గా నూకల రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో భాగంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా డప్పు వాయిద్యాలతో ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందుకొని జలగం నగర్ ఎంపీడీవో ఆఫీస్ నందు 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో ప్రతి ఒక్క పేదవాడికి న్యాయం జరుగుతుందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంత్రి పరిపాలనలో ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీని నెంబర్ వన్ స్థానంలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. 28వ వార్డు అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం ప్రజలకు ఏ అవసరమైన నిరంతరం అందుబాటులో ఉంటానని సంక్షేమ ఫలాలు అందరికీ అందే విధంగా తోడ్పాటునందిస్తానని ఆయన తెలిపారు. 28వ వార్డు లోని ప్రజలు తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూక్య సురేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వందలాదిమంది కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# పాపం.. అనిత..

వరంగల్, జనవరి 30 వరంగల్‌లో ఇద్దరు వ్యక్తులు వేధించడంతో అవమానం భరించలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమ, పెళ్లి పేరుతో ఇద్దరు ఏకకాలంతో తనను వేధించడంతో మనస్తాపానికి లోనై బలవన్మరణం చెందింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన అనిత వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో పని చేస్తున్నారు. ఆమెను దూరపు బంధువైన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొమ్మనపల్లి తండాకు చెందిన రాజేందర్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. కానీ ఆమె డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయమంటూ, వేరే ఎవరితోనో మాట్లాడుతున్నావు అంటూ తరచూ అనుమానిస్తూ వేధించేవాడు. ఈ వేధింపులు భరించలేక అనిత తన తల్లిదండ్రులకు చెప్పగా, వారు రాజేందర్ పద్ధతి నచ్చక తమ కూతురిని అతడికి ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని తెగేసి చెప్పారు. అయినా రాజేందర్ ఆమెను బతిమాలుతూ వేధిస్తూనే ఉన్నాడు.మరోవైపు అనిత తన క్లాస్‌మేట్ జబ్బార్‌లాల్‌తో చనువుగా ఉండటం, వాళ్లిద్దరూ పెళ్లి చేసుకోవాలని అనుకోవడం రాజేందర్‌కు తెలిసింది. దీంతో కోపంతో జబ్బార్‌కు ఫోన్ చేసి అనిత గురించి చెడుగా చెప్పాడు. అది నమ్మిన జబ్బార్ కూడా కానిస్టేబుల్ అనితను వేధించడం మొదలుపెట్టాడు. పెళ్లి చేసుకోవాలంటే తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఒకేసారి ఇద్దరు తనను వేధిస్తుండటం, అనుమానించడాన్ని అవమానంగా భావించింది. ఈ క్రమంలో ఆందోళనకు గురైన అనిత ఈ నెల 27న రాజేందర్‌కు ఫోన్ చేసి నువ్వు, జబ్బార్ కలిసి నా జీవితాన్ని నాశనం చేశారు. మీవల్లే ఆత్మహత్య చేసుకుంటున్నాను అని చెప్పింది.

# గాలి మళ్లిస్తున్న గాలి రామ్ మోహన్











**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 30 జనవరి 2026** మణికొండ బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి రామ్ మోహన్ రావు ఇప్పటి వరకూ హైదరాబాద్ నగరంలో మొదలు పెట్టి రాష్ట్ర, అంతర్ రాష్ట్ర ఆటల పోటీలలో పాల్గొని ఎనలేని బంగారు, వెండి పథకాలను బహుమతులు సాధించుకున్న దిట్టమైన ఆటగాడిగా పేరు ప్రఖ్యాతలు పొంది ఉన్నాడు. ప్రస్తుతం మహారాష్ట్ర లోనీ నాసిక్ నగరములో జనవరి 27 నుండి 31 వరకు ప్రతిష్టాత్మకముగా జరుగుతున్న నేషనల్ మాస్టర్స్ గేమ్స్ 2026 లో పాల్గొని ఇప్పటి వరకూ సాధించిన ఘన విజయాలకు వత్తాసుగా జోడిస్తూ, తన ప్రతిభను మరొక్కసారి చాటుకుని ఇప్పటి వరకూ మూడు సువర్ణ పతకాలను కైవసం చేసుకోవడం ఆనంద దాయకమని మణికొండ బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు అందె లక్ష్మణ్ రావు తెలియ పరచారు. నేషనల్ మాస్టర్స్ గేమ్స్ 2026 అంతర్భాగంలో రెండు రోజుల క్రితం జరిగిన జవాలిన్ త్రోలో, తత్ పర్యంతం గురువారం రోజున జరిగిన షాట్ పుట్ త్రోలో, అదేమాదిరి ఐదు వేల వాకింగ్ లలో ముచ్చటగా మూడింటిలో ఏక మొత్తముగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకోవడ మయినది. అందుకు గాను హైదరాబాదుకు రాగానే ఆయనకు మణికొండ బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ తరవున వారికి వెన్ను దన్నుగా ఉంటూ స్వాగత సమాహారానికి ఏర్పాట్లు గావిస్తామని అసోసియేషన్ సభ్యుల తరవున ముక్త కంఠంతో తెలియ జేసినారు.

# సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 30 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఏర్పాటు చేసిన 265 పోలింగ్ కేంద్రాలకు గాను 265 మంది పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 53 మంది రిజర్వ్ పి. ఓ.లు, 265 మంది ఎ.పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 53 మంది ఎ.పి.ఓ.లు,795 మంది ఓ.పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 159 మంది ఓ.పి.ఓ.లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో ఏర్పాటు చేసిన 68 పోలింగ్ కేంద్రాలకు గాను 68 మంది పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 14 మంది రిజర్వ్ పి. ఓ.లు, 68 మంది ఎ.పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 14 మంది ఎ.పి.ఓ.లు, 204 మంది ఓ.పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 41 మంది ఓ.పి.ఓ.లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో ఏర్పాటు చేసిన 36 పోలింగ్ కేంద్రాలకు గాను 36 మంది పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 7 మంది రిజర్వ్ పి.ఓ.లు,36 మంది ఎ.పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 7 మంది ఎ.పి.ఓ.లు, 108 మంది ఓ.పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 22 మంది ఓ.పి.ఓ.లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు.క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో ఏర్పాటు చేసిన 45 పోలింగ్ కేంద్రాలకు గాను 45 మంది పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 9 మంది రిజర్వ్ పి. ఓ.లు, 45 మంది ఎ.పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 9 మంది ఎ.పి.ఓ.లు,135 మంది ఓ.పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 27 మంది ఓ.పి.ఓ.లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో ఏర్పాటు చేసిన 15 పోలింగ్ కేంద్రాలకు గాను 30 మంది పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 6 మంది రిజర్వ్ పి. ఓ.లు,30 మంది ఎ.పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 6 మంది ఎ.పి.ఓ.లు,90 మంది ఓ.పి.ఓ.లతో పాటు 20 శాతం అదనంతో 18 మంది ఓ.పి.ఓ.లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. సిబ్బంది తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సహంగా బోట్ రేస్ పోటీలు

విశాఖపట్నం విశాఖ ఉత్సవ్ లో భాగంగా నిర్వహించిన బోట్ రేస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మంగమారిపేట వద్ద ఏర్పాటు చేసిన ఈ పోటీలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తో కలిసి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. సమీప గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరి చారు.నాన్ మెకనైజ్డ్ బోట్ల రేస్ చిప్పాడ ఉప్పుగల్లి తీరం నుంచి ప్రారంభమై భీమిలి జోనల్ కార్యా లయం సాగింది.రెండు విభాగాల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ఈ నెల 31వ తేదీన ఆర్కే బీచ్ ప్రధాన వేదిక వద్ద జరిగే ముగింపు వేడుక ల్లో బహుమతులు అందజేయను న్నారు. ఇదిలా ఉండగా పడవ పోటీలను వీక్షించేందుకు భీమిలి తీరంలో జనం పోటెత్తారు. మత్స్య శాఖ, టూరిజం, క్రీడా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.

# నీటి బిల్లుల భారం మోపుతున్న జలమండలి పై పోటెత్తిన జనం





**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 30 జనవరి 2026**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రకారం ప్రజలకు త్రాగు నీటి వ్యవస్త చట్టబద్ధతతో కూడుకున్న హక్కనీ, అట్టి వనరులు అందుబాటులోకి తేవడం ప్రజా స్వామ్య ప్రభుత్వం బాధ్యత అని అందుకు విరుద్ధముగా తెలంగాణ ప్రభుత్వం 18 వ డివిజన్ జలమండలి అధికారులు గడచిన ఐదు సంవత్సరముల కాల పరిమితికి సంబంధించిన లెక్కా పత్రం లేని నీటి బిల్లులు మరియు వాటిపై అదనపు రుసుములు కట్టాలని ప్రజలను వత్తిడి చేస్తున్నారు, రుసుము కట్టని యెడల నీటి సరఫరా ఆపు చేస్తామని దౌర్జన్యకర పద్ధతి అవలంబిస్తున్నారు. పలుమార్లు ఇట్టి విషయమై పలువురు జలమండలి పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళి నను ప్రయోజనం లేకుండ పోయిందని వాపోతు, పర్యవసానంగా గురువారం రోజున పురజనుల కార్యచరణ కమిటీ, అసంఖ్యాక స్థానిక ప్రజానీకంతో పాటు నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ స్వామి, సిద్ధప్ప, రవికాంత్ రెడ్డి, సాయి రెడ్డి, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, సీతారాం ధూళిపాళ, స్థానిక నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున కలసి కట్టుగా జలమండలి అవలంబిస్తున్న దుశ్చర్యలకు విరుద్ధముగా వివిధ రకాల నినాదాలతో కూడుకున్న ప్లకార్డ్ లు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టడం, తత్ పర్యంతం 18 వ డివిజన్ జలమండలి జనరల్ మేనేజర్ అధికారి గడ్డం శ్రీనివాస్ రెడ్డినీ కలసి ఉదాహరణకు దర్పణముగ్గా రెండు బిల్లులను జతపరచిన వినతి పత్రం అందజేయడం జరిగినది. గత సంవత్సర కాలముగా జలమండలి అధికారులు చేపట్టిన దౌర్జన్య కర చర్యలపట్ల స్పందించకుండా, ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకోకుండా, సాంకేతిక పద్ధతిలో నీటి సరఫరా అయినదా లేదా అనే అంశాలను తెలుసు కోవడానికి ప్రయత్నించ కుండా స్థానిక ప్రజా ప్రతినిధులు నిద్రావస్త నుండి మేలుకొని ప్రస్తుత తరుణంలో మొత్తం రుసుము రద్దు చేసే చర్య చేపట్టకుండా, అందుకు బదులుగా ప్రజలకు ఏదో పొడుస్తున్నాం అని డాంబికాలకు పోతూ ఏడ్చే వాడి కళ్ళు తుడిచినట్టు, బకాయి మొత్తమును వాయిదా పద్ధతిగా కట్టే ఏర్పాటు చేస్తామని చెప్పడం వింతగా ఉన్నదని స్థానికులు మొర పెట్టుకొన్నారు.

# నామినేషన్ల స్వీకరణలో గడువు సమయాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 30 :**మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో సమయపాలన కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, నామినేషన్ల స్వీకరణలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని,సాయంత్రం 5 గంటలకు గేటు మూసివేయాలని, గేటు లోపల ఉన్నవారికి టోకెన్లు అందజేసి వరుస క్రమంలో నామినేషన్లు స్వీకరించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని,నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు పూర్తి చేసిన అభ్యర్థులు హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ,2వ తేదీన అభ్యంతరాలు,ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే),13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని,ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో ఫుల్ ట్రాఫిక్

వరంగల్, జనవరి 30 ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరలో భక్తులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో పాటు చేయి చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. వనదేవతలు సమ్మక్క – సారలమ్మలకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. తల్లుల దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉన్న భక్తుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడం హాట్ టాపిక్ అవుతోంది.శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన పోలీస్ అధికారులు భక్తులపై అత్యుత్సాహం చూపుతూ దురుసుగా ప్రవర్తించడం సరికాదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తిభావంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తమపై ఇలాంటి దాడులు చేయడం సరికాదని భక్తులు వాపోతున్నారు.మేడారం జాతర సందర్భంగా తాడ్వాయి– మేడారం రోడ్డులో భారీ ట్రాఫిక్ జామ్ అయింది. తాడ్వాయి నుండి మేడారం మార్గంలో దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ.. బండి రమేష్



**కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 30:**కూకట్పల్లి నియోజక వర్గం కూకట్పల్లి డివిజన్ లో నివాసం ఉంటున్న గంగాధర్ 54 సంవత్సరాలు పక్షవాతం సమస్యతో రాందేవ్ రావు ఆసుపత్రిలో హాస్పిటల్ లో చేరడం జరిగింది. భరత్ కూకట్పల్లి లోని గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయం లో సంప్రదించగా వారికి కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిది కి అప్లై చేయడం జరిగింది.వారికి 160,000 రూపాయల సీఎంఆర్ఎఫ్ మంజూరు అయ్యింది సీఎంఆర్ఎఫ్ లెటర్ ను కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ చేతుల మీదుగా హేమదుర్గ భవన్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో గంగాధర్ కుమారుడు భారత్ కి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, వెంకటేష్, పాల్గొన రావు, సలీం, అబ్దుల్లా, సాయి తులసి, బాలరాజు ,రవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు చేయాలి

### జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.లలిత



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 30(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలోని అన్ని కార్యాలయాలు, సంస్థలు,ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలకు చెందిన సంస్థల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం -- 2013 ప్రకారం తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు,అలాగే, ఏర్పాటు చేసిన అంతర్గత ఫిర్యాదు కమిటీ వివరాలను కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని షి బాక్స్ పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి కె. లలిత సూచించారు,షి బాక్స్ పోర్టల్ వెబ్‌సైట్:https://shebox.wcd.gov.inఅంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు చేయని లేదా అంతర్గత ఫిర్యాదు కమిటీ వివరాలను పోర్టల్‌లో నమోదు చేయని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు,కావున, సంబంధిత అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థలు,పరిశ్రమలు వెంటనే అంతర్గత ఫిర్యాదు కమిటీని ఏర్పాటు చేసి, పూర్తి వివరాలను షి బాక్స్ పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు,ఈ విషయాన్ని గమనించి తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మరియు సంస్థల యాజమాన్యాలను తెలియచేశారు.

## భారీగా పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన ఏదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు

**ఖమ్మం ప్రతినిధి జనవరి 30 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన 7,28,29,30,31,32 వార్డుల అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి తో కలిసి వరంగల్ క్రాస్ రోడ్ రింగ్ లో వున్న ఆంజనేయ స్వామి దేవస్థానం లో పూజలు నిర్వహించి అనంతరం పెద్దఎత్తున కార్యకర్తలు అభిమానులు తో కలిసి ర్యాలీ గా వెళ్లి స్థానిక జలగం నగర్ లోని ఎంపీడీఓ ఆఫీస్ నందు తమ నామినేషన్ దాకల్ చేసారు ఈ సందర్భంగా తుంబూరి దయాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రజాపాలన కి పట్టం కట్టాలని కోరినారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కార్యకర్తల అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## నారాయణఖేడ్ పరిధిలో గుప్పుమన్న గంజాయి

### పంచగామా శివారులో రూ.70 లక్షల గంజాయి స్వాధీనం




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 30(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** నారాయణఖేడ్/సంగారెడ్డి జిల్లాలో మరో సారి గంజాయి కంపు గుప్పుమన్నది, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం ఎంత శ్రద్ధ తీసుకున్న రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర గంజాయి గాటు వస్తుంది,సంగారెడ్డి జిల్లా పోలీసులు మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న గంజాయి కేటుగాళ్ళు మాత్రం పట్టుబడుతున్నారు, వివరాలలోకి వెళితే నారాయణఖేడ్ మండల పరిధిలోని పంచగామ శివారులో ఆవుటి నాగయ్య వ్యవసాయ పొలంలో గంజాయి మొక్కలను అంతర పంటగా సాగు చేస్తున్నాడని పక్క సమాచారంతో జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది శుక్రవారం అకస్మిక దాడులు నిర్వహించారు,ఈ దాడులలో 600 గంజాయి మొక్కలు 17.741 కేజీల ఎండు గంజాయి, 0.897 కేజీల గంజాయి విత్తనాలు 30 వేల రూపాయల నగదు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని దీని విలువ సుమారు 70 లక్షలు ఉంటుందని డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ సీఐ శంకర్ తెలిపారు,ఈ దాడులలో ఎస్సై జి.హనుమంతు,డి. అనుదీప్, కానిస్టేబుళ్లు అంజిరెడ్డి అరుణ జ్యోతి రాజేష్ శివకాంత్ ఉన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జలాశయాల గణన సర్వే



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 30 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** టేక్మాల్ మండలంలోని గ్రామాలలో జలాశయాల గణనపై, మండల ఎన్యుమరేటార్లు, ఆయా గ్రామాలలో, నీటి వనరుల వినియోగించుకోవడం కోసం సరైన రీతిలో సమగ్రమైన, మరియు విశ్వాసమైన డాటా బేస్ ను ఈ సర్వే యొక్క ప్రధాన లక్ష్యం అని, టేక్మాల్,తహసిల్దార్ తులసి రామ్, తెలిపారు ఎన్నుమారేటర్లు, జగాశయాలు మరియు భూగర్భ జల సంబంధించిన, ఖచ్చితమైన వివరాలను, మొబైల్ యాప్ ద్వారా, బోర్ సర్వే నమోదు చేసినారు, ఈ ప్రణాళిక కలెక్టర్ ఆదేశాల మేరకు, టేక్మాల్, మండలంలోని కోరంపల్లిలో 100% బోర్ సర్వే పూర్తి చేయడం జరిగింది, కోరంపల్లి (జిపిఓ) భగవత్, గీత, బాలరాజ్, ఈ ప్రణాళికను పూర్తి చేసినారు సర్పంచ్, మరియు ఉప సర్పంచ్ , గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు ఈ సర్వేకు సహకరించారు...

## భారీగా పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన ఏదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు




**ఖమ్మం ప్రతినిధి జనవరి 30 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన 7,28,29,30,31,32 వార్డుల అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి తో కలిసి వరంగల్ క్రాస్ రోడ్ రింగ్ లో వున్న ఆంజనేయ స్వామి దేవస్థానం లో పూజలు నిర్వహించి అనంతరం పెద్దఎత్తున కార్యకర్తలు అభిమానులు తో కలిసి ర్యాలీ గా వెళ్లి స్థానిక జలగం నగర్ లోని ఎంపీడీఓ ఆఫీస్ నందు తమ నామినేషన్ దాకల్ చేసారు ఈ సందర్భంగా తుంబూరి దయాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రజాపాలన కి పట్టం కట్టాలని కోరినారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సురేష్ నాయక్ వెంపటి రవి మంగీలాల్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు



## వేములవాడలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్.

### సొంత గూటికి చేరిన గూడూరు మధు దంపతులు.

### వేములవాడ మున్సిపల్ 25 వార్డు కౌన్సిలర్ గా పోటీ.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో ప్రధాన రాజకీయ పార్టీలు మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే ఆశావాహులు తమకు అనుకూలమైన పార్టీలో పార్టీ టికెట్ రానందున, ఆశావాహులు పార్టీలు మారడం నిత్యకుత్యమైంది.



శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ గూడూరు మధు, అతని భార్య గూడూరు లక్ష్మీలు తిరిగి సొంత పార్టీ బీఆర్ఎస్ లో చేరడం జరిగింది. వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో గులాబీ పార్టీ తీర్థం తీసుకున్నారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ గూడూరు మధు కుటుంబం మొదటి నుంచి బిఆర్ఎస్ పార్టీతో అనుబంధం కలిగి ఉందని, సొంత గుటికి వచ్చిన వారిని సాధారంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో గూడూరు మధు 25 వ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉంటారని ఆయన ప్రకటించారు. వార్డు అభివృద్ధి లక్ష్యంగా, ప్రజలకు మరింత చేరువయ్యి అందుకే తమ నిర్ణయం తీసుకున్నట్లు గూడూరు మధు దంపతులు పేర్కొన్నారు. ఈ చేరికతో వేములవాడ మున్సిపల్ ఎన్నికలవేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఎప్పుడు పార్టీ మారుతారో, ఎవరు సొంత పార్టీలో ఉంటారో అర్థం కాని అయోమయ పరిస్థితులు వేములవాడ మున్సిపల్ లో నెలకొని ఉన్నాయి. శుక్రవారం రోజు తో నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో పార్టీ బీఫామ్ ఎవరికి దక్కుతుందో, ఎవరికి రాదో, ఆశావాహులు లెక్కలు వేస్తూ, తమకు అనుకూలమైన మార్గాలలో పండించడానికి సిద్ధంగా ఉన్నట్లు అత్యంత విశ్వాసనీయ సమాచారం బట్టి తెలుస్తున్నది.

## అప్రమత్తంగా ఉంటూ.. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి.

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరీమ అగ్రవాల్.

### సంకేపల్లి, శాతరాజు పల్లి, కోనాయిపల్లి ఎస్. ఎస్. టి. చెక్ పోస్టుల తనిఖీ.






**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎస్. ఎస్. టి. (స్టాటిక్ సర్వే లైన్స్ టీం) చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

వేములవాడ మున్సిపల్ పరిధిలోని కరీంనగర్ రోడ్డు లో ఉన్న సంకేపల్లి, జగిత్యాల రోడ్డులో ఉన్న శాతరాజు పల్లి, కోరుట్ల రోడ్డులో ఉన్న కోనాయపల్లి వద్ద ఏర్పాటుచేసిన ఎస్. ఎస్. టి. చెక్ పోస్టులను ఇన్చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి శుక్రవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్టులలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, తరలించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెక్ పోస్టులలో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి ఇప్పటివరకు తనిఖీ చేసిన వాహనాల వివరాలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు ఉన్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. వాహనాల తనిఖీ ప్రక్రియ కట్టుదిట్టంగా చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

అలాగే ప్రతి తనిఖీ వివరాలను స్పష్టంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల నియమాలని కచ్చితంగా అమలు చేయాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరీమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

ఈ తనిఖీలలో వేములవాడ అర్బన్ తహసీల్దార్ జయంతి కుమార్, రెవిన్యూ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు.
## రగుడు చెక్ పోస్ట్ వద్ద 20 లక్షల రూపాయలు సీజ్.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు పలు కూడళ్లలో పోలీసుల చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగింది. శుక్రవారం రోజు ఉదయం ఏడు గంటల 45 నిమిషాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం కు అతి సమీపంలో రగుడులో ఏర్పాటుచేసిన పోలీస్ చెక్ పోస్ట్ ఎస్ ఎస్ టి బృందం వాహన తనిఖీలు నిర్వహించగా వేములవాడ పట్టణానికి చెందిన గణాచారి సాంబశివు తండ్రి శంకరయ్య, ఇంటి నెంబర్: 6/3/65 మార్కెట్ రోడ్ వేములవాడ పట్టణమునకు చెందిన వ్యక్తి తన కారులో లెక్కలలో లేని అనుమానాస్పదమైన నగదు రూపాయలు 20,00,000/బిరూపాయలు 20 లక్షలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అట్టి నగదు మొత్తాన్ని ఎన్నికల నిబంధనలు, చట్టపరమైన విధానాల ప్రకారం, ఎస్ ఎస్ టి బృందం ఇంచార్జ్ జి. ఆనంద్, ఏపీఆర్ఓ సమక్షంలో, మధ్యవర్తుల పంచనామా సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఆ నగదు యొక్క మూలం ఉపయోగ ఉద్దేశం తెలుసుకునేందుకు తదుపరి విచారణ దర్యాప్తు కొనసాగుతుందని సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కే. కృష్ణ పేర్కొన్నారు.

## వేములవాడ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో చివరి రోజు జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రోజు నుండి 144వ సెక్షన్ అమలులో ఉందని, దీనికి ప్రజలందరూ సహకరించాలని అని కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. శుక్రవారం రోజు నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో సజావుగా నామినేషన్ల ప్రక్రియ రెండు మున్సిపాలిటీలలో కొనసాగుతుందన్నారు. మున్సిపల్ ఫలితాలు వెలువడే అంతవరకు అనగా ఫిబ్రవరి 13వ తేదీ రాత్రి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు మున్సిపాలిటీలు ఉన్నాయని, వాటిలో సజావుగా నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో కోనాయపల్లి వద్ద, శాతరాజు పల్లి వద్ద, సిరిసిల్ల ప్రధాన రహదారిలో రగుడు వద్ద మూడు పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## జోగిపేట అభివృద్ధిలో చారిత్రాత్మక మైదురాయి మంత్రి దామోదర్ రాజనర్సింహ ముద్ర




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 30 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా :** ఆందోల్,– –జోగిపేట డివిజన్ పరిధిలో, రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి నివాస భవనం, నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రూ, 5.75, కోట నిధులను మంజూరు చేయడం, జోగిపేట ప్రజలకు దక్కిన గొప్ప విజయంగా నిలిచింది, ఇంతకాలం మునుపటి ప్రభుత్వ హయాంలో ఆందోల్ –జోగిపేట డివిజన్ ను, ఏర్పాటు చేసినప్పటికీ, సొంత ఆర్డిఓ భవన కార్యాలయం లేకుండా, సిబ్బందికి సౌకర్యాలు లేకుండా అలాగే డిఎస్పి సర్కిల్ కూడా లేకుండా, రెవెన్యూ పోలీస్ వ్యవస్థలు, తీవ్ర ఇబ్బందులతో, కొనసాగిన విషయం అందరికీ తెలిసిందే, కానీ ప్రజా సమస్యల పరిష్కారమే, లక్ష్యంగా పనిచేస్తున్న, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు, శ్రీ దామోదర్ రాజనర్సింహ, జోగిపేట ప్రాంత ప్రాధాన్యతను గుర్తించి, స్వయంగా చొరవ తీసుకొని ఆర్డీవో కార్యాలయ భవనం, ఆర్డీవో అధికారికి నివాస భవనం, నిర్మాణానికి 5,75, కోట్ల నిధులు, మంజూరు చేయించారు, ఇది కేవలం భవన నిర్మాణశీ మాత్రమే కాదు, ప్రజలకు వేగవంతమైన రెవెన్యూ సేవలు, అధికారులు అందుబాటులో ఉండే పాలన, జోగిపేటకు పరిపాలన గౌరవం అన్నింటికీ బాటలు వేసే నిర్ణయం, ఇంతటితో ఆగకుండా, ఇంకా కొద్ది రోజుల్లోనే జోగిపేటకు డిఎస్పీ కార్యాలయాన్ని, కూడా మంజూరు చేయనున్నట్లు, మంత్రి స్పష్టం స్పష్టం చేయడం, ప్రాంత ప్రజల్లో మరింత విశ్వాసాన్ని కలిగిస్తుంది రెవెన్యూ డివిజన్ కు సొంత భవనం, అధికారులకు నివాస సౌకర్యాలు, పోలీసు వ్యవస్థ బలోపేతానికి, డీఎస్పీ సర్కిల్, ఇవన్నీ దామోదర్ రాజనర్సింహ, పాలన ముద్రకు నిదర్శనం , జోగిపేట అభివృద్ధిని, కేవలం హామీలకే పరిమితం చేయకుండా, ఆచరణలో చూపుతున్న మంత్రివర్యులకు ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు, జోగిపేట అభివృద్ధి అంటే – దామోదర్ రాజనర్సింహ, ఇది మాట కాదు మంత్రిగారి మార్క్....

## సంగారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 30(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయబోతున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అభ్యర్థులను సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు,ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎన్నికల సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పటోళ్ల శశిధర్ రెడ్డి,ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజ నర్సు,పట్టణ అధ్యక్షులు రాస వెంకటేశ్వర్లు,కార్యదర్శి నరసింహులు,మాజీ సిడిసి చైర్మన్ బుచ్చి రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, హాకీమ్,తదితరులు పాల్గొన్నారు. 32 వార్డులకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన 8 వార్డుల అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని నాయకులు తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా

వార్డ్ నంబర్ 1 -- దండు నర్సిములు
వార్డ్ నంబర్ 3 -- నంద నాయకుల నరసింహారాజు
వార్డ్ నంబర్ 4 -- కసిని శ్రీకాంత్
వార్డ్ నంబర్ 5 -- షాజిదా బేగం
వార్డ్ నంబర్ 7 -- మొగుళ్ళ శరత్ యాదవ్
వార్డ్ నంబర్ 8 -- కర్రే సురేష్
వార్డ్ నంబర్ 9 -- లాడే శిరీష
వార్డ్ నంబర్ 10 -- ప్యాట విటల్ రెడ్డి
వార్డ్ నంబర్ 11 -- పొన్న దశరథ్ రెడ్డి
వార్డ్ నంబర్ 12 -- పొన్న రాజేందర్ రెడ్డి
వార్డ్ నంబర్ 14 -- అల్లూరి లక్ష్మణ్
వార్డ్ నంబర్ 16 -- కొత్తపల్లి శ్రీకాంత్
వార్డ్ నంబర్ 17 -- నౌషిన్
వార్డ్ నంబర్ 18 -- దుర్గాల లక్ష్మి
వార్డ్ నంబర్ 19 -- చాకలి స్వప్న
వార్డ్ నంబర్ 20 -- గౌసియా బేగం
వార్డ్ నంబర్ 22 -- మున్నూరు విష్ణువర్ధన్
వార్డ్ నంబర్ 23 -- ఎం.ఆర్. మనోరంజని
వార్డ్ నంబర్ 24 -- అరిఫా బేగం
వార్డ్ నంబర్ 25 -- అంజుమ్
వార్డ్ నంబర్ 26 -- ఎండి జీషన్ పర్వేజ్
వార్డ్ నంబర్ 27 -- నక్క మంజులత
వార్డ్ నంబర్ 28 -- కాశిపురం లక్ష్మి
వార్డ్ నంబర్ 29 -- బేగరి శ్రీకాంత్
వార్డ్ నంబర్ 31 -- శంకరి విజేందర్ రెడ్డి
వార్డ్ నంబర్ 32 -- నాయకోటి అశ్విని
వార్డ్ నంబర్ 33 -- ఆర్.వి. గోవర్ధన్ నాయక్
వార్డ్ నంబర్ 34 -- షబానా బేగం
వార్డ్ నంబర్ 35 -- శంకరన్నోల్ల శైలజ
వార్డ్ నంబర్ 36 -- లాడే మనీలా
వార్డ్ నంబర్ 37 -- బలవంతుల జలేందర్ రావు
వార్డ్ నంబర్ 38 -- ఎండి జాఫర్

## ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీ నియంత్రణ

### అనుమానాస్పద లావాదేవీలపై గట్టి నిఘా :జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 30(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు,ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఏఈఓల బృందాలు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు,శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏం.సి.సి., ఎం.సి.ఎం.సి. నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు,ఏఈఓలు తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఎన్నికల వ్యయ నియంత్రణలో అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.ఎన్నికల ప్రచార ఖర్చులు ప్రతి అభ్యర్థి ఖాతాలో ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎన్నికలను ప్రభావితం చేసే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు,ముఖ్యంగా డబ్బు, మద్యం, విలువైన వస్తువులు తదితరాలను అక్రమంగా పంపిణీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,అనుమానాస్పద లావాదేవీలు,బల్క్‌గా సరఫరా అవుతున్న వస్తువులు,నగదు కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వ్యయ నియంత్రణలో భాగంగా ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గట్టి నిఘా కొనసాగించాలన్నారు,ఎన్నికల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు,అదేవిధంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని,
ఏ చిన్న ఉల్లంఘనకైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు,ఆయా అధికారులు సమిష్టిగా పనిచేసినప్పుడే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని తెలిపారు,ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఎక్సైజ్ శాఖ అడిషనల్ సూపరింటెండెంట్, డిసిఓ కిరణ్ కుమార్, ఎం.సి.సి నోడల్ అధికారి జగదీష్, ఎం.సి.ఎం.సి నోడల్ అధికారి విజయలక్ష్మి, ఎల్‌డిఎం నర్సింగ్ రావు ,అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 30(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:నారాయణఖేడ్/** పట్టణంలోని 13వ వార్డు బిజెపి అభ్యర్థి ఎంబడి వెంకటరెడ్డి మున్సిపాలిటీలోని 13వ వార్డు నుంచి బిజెపి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని వార్డు సభ్యులు తనను ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థి ఎంబడి వెంకటరెడ్డి తెలిపారు,యువత రాజకీయాలకు రావాలన్న సంకల్పంతో బరిలో ఉన్నానని తెలిపారు. వార్డు సభ్యులు ఆశీర్వదించి ఓట్లు వేసి గెలిపించాలని తెలిపారు. వార్డును అభివృద్ధి దిశగా తీసుకువెళ్తానని తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com